JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 297 16 మంగళవారం జూన్ 2026 ఎడిటర్ గుంటపల్లిస్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

# కబ్జా నుంచి కాపాడండి

జనసైన్యం సిటి

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని సీతారాంపూర్ శివారులో గల 'మేలకుంట చెరువు శిఖం' ప్రభుత్వ భూమిని (సర్వే నెం. 71) అక్రమ కబ్జాల నుండి కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బండారి శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కామెర బద్రినేత తో కలసి ఈ రోజు జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. చెరువు పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను నిలిపివేసి, ఎఫ్.టి.ఎల్ (F T L), బఫర్ జోన్ హద్దులను ఏర్పాటు చేయాలని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను ఆదేశించాల్సిందిగా కోరారు.ఈ సందర్భంగా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, సర్వే నెం. 71 లోని మేలకుంట శిఖం ప్రభుత్వ భూమి (మొత్తం విస్తీర్ణం: 13 ఎకరాల 26 గుంటలు) భారీగా కబ్జాకు గురవుతున్న విషయమై నగర ప్రజల తరపున కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ చెరువు శిఖం భూమిని ఆక్రమించి, పక్కనే ఉన్న పట్టా సర్వే నెంబర్లను చూపిస్తూ, తప్పుడు పత్రాలతో మున్సిపాలిటీ నుండి అనుమతులు పొంది అక్రమంగా ప్రైవేట్ భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు.

అధికారిక నివేదికలను బేఖాతరు చేస్తూ కబ్జాలు: గతంలో (తేది 22-12-2023 న) డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఆధ్వర్యంలో



బండారి శేఖర్‌జిల్లా ప్రధాన కార్యదర్శి,ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్

కొత్తపల్లి, చొప్పదండి, కరీంనగర్ రూరల్ సర్వేయర్లు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. దాదాపు 40 మందికిపైగా అక్రమార్కులు ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించి రెసిడెన్షియల్ భవనాలు, ఫంక్షన్ హాళ్లు, విద్యాసంస్థల భవనాలు, బేస్మెంట్లు నిర్మించారని =ఇూ గారి స్పష్టమైన నివేదిక ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా పెద్ద పెద్ద భవనాలు, రోడ్లు నిర్మిస్తూనే ఉన్నారని అన్నారు. చెరువు, నాలాలు కబ్జాకు గురికావడంతో స్వల్ప వర్షానికే ఆర్టీసీ వర్క్షాప్ దగ్గర ఉన్న సూర్యనగర్ కాలనీ పూర్తిగా జలమయమవుతోంది తెలిపారు. కరీంనగర్ - జగిత్యాల ప్రధాన రహదారి చెరువును తలపిస్తూ, ట్రాఫిక్ స్తంభించి స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన డిమాండ్లు:

1. ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ హద్దుల ఏర్పాటు: మేలకుంట చెరువు శిఖం భూమికి ఇప్పటి వరకు ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ హద్దులు నిర్ణయించకపోవడం వల్లే ఈ అక్రమాలు జరుగుతున్నాయి. కావున తక్షణమే హద్దుల పిల్లర్లు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ మరియు రెవిన్యూ శాఖలను ఆదేశించాలి.

2. నిర్మాణాల నిలిపివేత ఢ కూల్చివేతలు: చట్టవిరుద్ధంగా మున్సిపల్ అనుమతులు పొంది నిర్మిస్తున్న భవన నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, ఇప్పటికే నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేయడానికి తగిన ఆదేశాలు ఇవ్వాలి.3. ఉన్నత స్థాయి విచారణ: ప్రభుత్వ శిఖం భూముల్లో మున్సిపాలిటీ అధికారులు ఏ రకంగా నిర్మాణ అనుమతులు ఇచ్చారో ఉన్నతాధికారులచే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలి.జిల్లా కలెక్టర్ గారు తక్షణమే స్పందించి ప్రభుత్వ భూమిని, మేలకుంట చెరువును రక్షించి నగర ప్రజలకు ఊరట కలిగించాల్సిందిగా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున డిమాండ్ చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు



కలెక్టర్ చిత్రా మిశ్రా

జనసైన్యం సిటి

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి , ఆర్డీవో షర్మిల, కలెక్టరేట్ ఏవో సుధాకర్ రెడ్డి తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 256 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 142,కరీంనగర్ నగరపాలిక సంస్థకు 60 వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ శాఖ, విద్యా శాఖల అధికారులతో మొదటి విడత రివ్యూ మీటింగ్ నిర్వహించామన్నారు. బుధవారం నిర్వహించే రెండో విడత మీటింగ్ కి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో డీపీఓ, డీఆర్డీఓ అధికారులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పెండింగ్ కోర్టు కేసులు, దరఖాస్తులు, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని హాయ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఈవారం యాక్షన్ ప్లాన్, తనిఖీ రిపోర్టులను శుక్రవారం సాయంత్రం లోగా సమర్పించాలని జిల్లా అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.అంతకుముందు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శాఖల వారీగా రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పేర్కొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలి

జనసైన్యం సిటి

ప్రైవేట్,కార్పోరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడి అరికట్టి,ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేసి,ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకిడే గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ..



రాష్ట్రంలో నేటి పాఠశాలలు పునః ప్రారంభం నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అనేక పాఠశాలలో టీచర్ల కొరత ఉన్నందున విద్యార్థులు చదువులకు ఆటంకం లేకుండా ప్రణాళికలు రూపొందించాలని, మధ్యాహ్న భోజనం ఇబ్బందులు లేకుండా చూడాలని, కరీంనగర్ జిల్లాలో,నగరంలో ప్రైవేట్ పాఠశాలల వారు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ ఫీజుల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా టెక్నో ,ఈటెక్నో , వరల్డ్,ఒలంపియాడ్, వంటి పేర్లతో ప్రచారం చేస్తున్నరూ , ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఇష్టానుసారంగా ఫీజులు పెంచుకున్నారని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకుండా విద్యాశాఖ నిబంధనలు పాటించకుండా పాఠశాలలు నిర్వహణ చేస్తున్నారని, పాఠశాల ఆవరణలోని పుస్తకాలు యూనిఫామ్స్ అమ్ముతు పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చారని, జిల్లాలో అనుమతులేని పాఠశాలలను గుర్తించి వాటి పేర్లు బహిర్గతం చేయాలని ప్రతి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో జీవో నెంబర్ 1 ,42 91 అమలు చేసే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని, లేక పాఠశాలలు రెసిడెన్షియల్ పేరిట అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయని,జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీ అరికట్టే విధంగా చర్యలు తీసుకొని నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ఉక్కు పాదం మోపాలని తమరికి ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కౌన్సిల్ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర సహాయ కార్యదర్శి బోయిని విష్ణువర్ధన్ పాల్గొన్నారు



గుంటపల్లి తిరుపతికి జన్మదిన శుభాకాంక్షలు



ఆర్థిక కు జన్మదిన శుభాకాంక్షలు




# జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన అద్విత విద్యార్థిని



**జనసైన్యం సిటి**

అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని వి. నందిని కరీంనగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (KDBA) ఆధ్వర్యంలో నిర్వహించిన కరీంనగర్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026లో అండర్-15 విభాగంలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.నందిని తన అద్భుతమైన ఆటతీరుతో, కృషి, పట్టుదల మరియు క్రీడా నైపుణ్యాన్ని చాటుతూ ఈ ఘన విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల అసెంబ్లీలో ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీ అనుదీప్ సౌగాని నందినికి స్వర్ణ పతకాన్ని అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, నందిని సాధించిన విజయం అందరికీ ఆదర్శమని శ్రీ అనుదీప్ సౌగాని పేర్కొన్నారు. ఆమె కృషిని కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నందిని విజయానికి వెన్నుదన్నుగా నిలిచిన ఆమె తల్లిదండ్రులు మరియు కోచ్‌లకు కూడా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలియజేసింది.పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు నందినిని ఘనంగా అభినందించారు. అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు విద్యతో పాటు సహ విద్యా రంగాల్లోనూ సమగ్ర అభివృద్ధి కల్పించేందుకు కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు తెలిపారు.

# బ్రేక్ ఫాస్ట్ , మిల్క్ పథకాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్.

**జనసైన్యం సిటి**



వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ & మిల్క్ పథకాన్ని రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్..

విద్యార్థులకు పుస్తకాలు & నోట్ బుక్స్ పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ .కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు దానం నాగేందర్ , యశస్విని రెడ్డి , కలెక్టర్ ప్రియాంక ఆలా ,డీఈవో యాదయ్య , మన్నా ట్రస్ట్ సీఈవో లీనా జోసెఫ్, ఇతర ముఖ్య అధికారులు.మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రభుత్వ పాఠశాలలో చదివే 29 లక్షల మంది విద్యార్థిని విద్యార్థులకు అల్పాహారం & పాలు పథకాన్ని ప్రారంభిస్తుంది..విద్యార్థులకు దీని ద్వారా పౌష్టిక ఆహారం అందిస్తుంది.ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడానికి విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా బడి బాట కార్యక్రమం ద్వారా డ్రాప్ ఔట్ విద్యార్థులను బడి లోకి తీసుకురావడం ఇతర పాఠశాలల్లోకి వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుంది..

స్వచ్ఛంద సంస్థల సహకారం ప్రభుత్వం దాదాపు 800 కోట్లు ఖర్చు చేస్తుంది..పిల్లలందరూ మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని పౌష్టిక ఆహారం అందిస్తున్నాం..

ఈరోజు నుండి ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభిస్తున్నాం..

వారు స్కూల్ లోనే తినేలా బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేస్తున్నాం.

ఉదయం లేవగానే రెడీ అయి స్కూల్ కి రావాలే ఇక్కడే బ్రేక్ ఫాస్ట్ లంచ్ చేయాలి..మీ తల్లిదండ్రులు కష్టపడుతున్న దాని కంటే రెట్టింపు చదువుకొని కస్టపడి మంచి పేరు తీసుకురావాలి..ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి..ప్రభుత్వ పాఠశాలలు ,ప్రభుత్వ హాస్పిటల్ లు వద్దు ,ప్రభుత్వ ఉద్యోగం కావాలని విధంగా వ్యవహరిస్తున్నారు..ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తున్నాం.. అందరూ కష్టపడి చదువుకోవాలి..

ఈ అల్పాహారం పథకం ప్రీ-ప్రైమరీ (PP) నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వర్తిస్తుంది..



అల్పాహారం పథకం ద్వారా విద్యార్థుల్లో ఆకలిని నివారించడం ,పోషకాహార లోపాన్ని తగ్గించడం , ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడటం, పాఠశాల హాజరును పెంచడం,డ్రాప్అవుట్‌లను తగ్గించడం ,విద్యార్థుల ఏకాగ్రత, విద్యా ప్రతిభను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది

రోజు అల్పాహారం పాలు/రాగి మాల్ట్ ఇస్తున్నాం..

సోమవారం దోసె - చట్నీ / చపాతీ - కూర పాలు
మంగళవారం మిల్లెట్ ఇడ్లీ (2) - సాంబార్ రాగి జావ
బుధవారం పూరీ (2) - ఆలూ కుర్మా పాలు
గురువారం మిల్లెట్ ఇడ్లీ (2) - సాంబార్ రాగి జావ
శుక్రవారం మిల్లెట్ ఉప్మా / పొంగల్ - చట్నీ పాలు
శనివారం బొండా (2) - చట్నీ రాగి జావ

సోమ, బుధ, శుక్రవారాలు - పాలు
మంగళ, గురు, శనివారాలు - రాగి జావ

అల్పాహారం కోసం ప్రభుత్వం వార్షిక వ్యయం రూ. 540 కోట్లు ఖర్చు చేస్తుంది పాల సరఫరా కోసం వార్షిక వ్యయం: రూ. 180 కోట్లు ఖర్చు చేస్తుంది..మొత్తం వార్షిక వ్యయం రూ. 720 కోట్లు ఈ పథకానికి ప్రభుత్వం ఖర్చు చేయనుంది..

ఈ పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, విద్యా నాణ్యతను పెంపొందించడంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది..హైదరాబాద్ జిల్లా పాఠశాల విద్యాశాఖ - అల్పాహార పథకం (2026-27) సంక్షిప్త నోట్

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార స్థాయిని మెరుగుపరచే లక్ష్యంతో 2026-27 విద్యా సంవత్సరం నుంచి అల్పాహార (దీతీమఖునెట్ఖుర్) పథకాన్ని అమలు చేయనుంది.హైదరాబాద్ జిల్లాలో జిల్లాలో మొత్తం 672 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.మొత్తం 93,501 మంది విద్యార్థులు చదువుతున్నారు.మొదటి దశ అల్పాహారం కింద హైదరాబాద్ జిల్లాలో 45 పాఠశాలలు ఎంపిక చేయబడ్డాయి.

ఈ పథకం ద్వారా 12,437 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.మన్నా ట్రస్ట్ (Manna Trus) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అమలు చేయబడుతుంది.

ప్రాథమిక పాఠశాలలు: 23 (5,258 మంది విద్యార్థులు)
ఉన్నత ప్రాథమిక పాఠశాలలు: 2 (175 మంది విద్యార్థులు)
ఉన్నత పాఠశాలలు: 20 (7,004 మంది విద్యార్థులు)

విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ఈ క్రింది ఆహార పదార్థాలు అందించబడతాయి:

ఈ పథకం ద్వారా విద్యార్థులకు ఉదయం పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యం, పాఠశాల హాజరు, ఏకాగ్రత మరియు విద్యా ఫలితాలను మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

# అగ్గిపుల్ల చిన్నదే !



ఓటమిని అంగీకరించడం సులభం
ఓటమిని సవాలు చేయడం సాహసం
గెలుపు దాకా పోరాడడం ధీరుల లక్షణం !
ధనం, ప్రేమ, గౌరవం, గృహం, లోకం..
ఇవన్నీ ఒక రోజు మనల్ని వదిలేస్తాయి
మన కర్మలే మనకు కీర్తిని మిగుల్చుతాయి !
మనకు రావలసింది పరుగున వస్తుంది
మనది కానిది ఏం చేసినా మనకు దక్కదు
వచ్చిన దానితో ఆనంద పడడమే జీవితం !
మంచి కర్మలతో శాంతి జత కడుతుంది
సత్కర్మలు శాంతిని తోడ్కొని వస్తాయి

చెడు చేష్టలు అశాంతికి ఆజ్యం పోస్తాయి !
సంపద ఉంటే సంబంధాలు పలుచన
సంబంధాల వెంట పడితే ధనం తక్కువ
డబ్బు, సంబంధాలుంటే ఆరోగ్యం తక్కువ !
ఒక్క చెట్టు లక్షల అగ్గిపుల్లలను ఇస్తుంది
ఒక్క అగ్గిపుల్ల అడవినంతా కాల్చేస్తుంది
ఒక్క దురాలోచన మంచినంతా కాల్చేస్తుంది !
జీవిత చరమాంకంలో వెనక్కి చూస్తే..
సంపాదన, కీర్తి ప్రతిష్టలు కనిపించవు
సరిగ్గా జీవించావా లేదా అని ప్రశ్నిస్తుంది !

మధుపాళీ

# దేశ సుస్థిరాభివృద్ధిలో వలసదారుల ఆర్థిక లావాదేవీలు

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి

(16 జూన్ "అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం" సందర్భంగా)




760

మన తెలుగు రాష్ట్రాల్లో ఎందరో కార్మిక శ్రామిక వర్గాలు అప్పుల భారాన్ని తగ్గించుకోవడ్నికి, తమ కుటుంబాలను అభివృద్ధి చేసుకోవడానికి, తమ స్వగ్రామంలో ఇల్లు కట్టుకోవడానికి దుబాయ్, సౌథీ అరేబియా లాంటి దేశాలకు కన్నీటి ధారలతో వలస వెళ్లడం చూస్తున్నాం. అదే విధంగా ఉన్నత విద్యార్హతలను కలిగిన యువత ఉన్నత ఉద్యోగాల వేటలో విదేశాలకు వలస వెళ్లడం కూడా జరుగుతుంది. ఇలాంటి వలసదారులు తాము కష్టపడి సంపాదించిన ధనాన్ని తమ ఊళ్లల్లో స్థిరపడిన కుటుంబ సభ్యులకు పంపడం ద్వారా ఆయా కుటుంబాల్లో ఆహార భద్రత, ఆరోగ్య పరిరక్షణ, పిల్లల విద్య, గృహ నిర్మాణాలు, అప్పులు తీర్చడం, కుటుంబ సమగ్రాభివృద్ధి జరగడం లాంటివి తరుచుగా చూస్తున్నాం. ఇలా విదేశాల్లో లేదా స్వదేశంలో ఇతర ప్రాంతాలకు జీవనోపాధులను వెతుక్కుంటూ వలసలు వెళ్లిన అభాగ్యుల శ్రమ తమ కుటుంబాలకు ఆశా దీపాలుగా పని చేస్తున్నాయి.

**అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం-2026 ఇతివృత్తం:**

వలసలు వెళ్లి సంపాదించిన డబ్బును తమ స్వంత ఊళ్లల్లో ఉన్న కుటుంబాలకు పంపించంతో ఆయా కుటుంబాలు ఆనంద ఆయురారోగ్యాలతో గడపడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట జూన్ 16న "అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ ఫ్యామిలీ రెమిటెన్సెస్ డే"ను ఘనంగా జరుగుపుకోవడం గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్నది. ఈ దినోత్సవ వేదికగా వలసదారుల శ్రమను గుర్తించడం, వారికి ప్రభుత్వ చేయూతను ఇవ్వడం, వలసదారుల యోగక్షేమాలను చూసుకోవడం, ఆర్థిక ప్రగతిలో వారి పాత్రను అవగాహన పర్చడం లాంటివి జరగాలి. 2026 అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం ఇతివృత్తంగా "చెల్లింపులు జీవనాధారం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది.

వలసదారులు తమ స్వదేశీ కుటుంబాలకు పంపించే చిన్న మొత్తం డబ్బులను పంపినప్పటికీ ఆ మొత్తం ఆయా కుటుంబాలు మెరుగైన జీవితాలను గడపడానికి ఉపకరిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో దాదాపు 5 ట్రిలియన్ డాలర్ల వలసదారుల చెల్లింపులు తమ కుటుంబాలకు చేరడం గమనించారు. 2030 నాటి ఈ చెల్లింపులు అదనంగా దాదాపు 4.4 ట్రిలియన్లు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

**ఒక బిలియన్ వలసదారులు – 500 బిలియన్ల చెల్లింపులు:**

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం నేడు ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ వలసదారులు 500 బిలియన్ డాలర్ల సంపాదనను తమ కుటుంబాలకు పంపించడం, ఆ కుటుంబాల్లో పేదరికం తగ్గుతూ, వారి జీవన ప్రమాణాలు పెరగడం జరుగుతోందని గమనించారు. ఈ వలసదారుల్లో 2.58 బిలియన్ల అంతర్జాతీయ వలసదారులు, 760 మిలియన్ల స్వదేశీ వలసదారులు ఉన్నారు. వలసదారులు పంపించే డబ్బు అధికంగా గ్రామీణ కుటుంబాల ఉన్నతికి ఉపయోగపడుతున్నాయి. మెక్సికో, చైనా, ఇండియా లాంటి దేశాల్లో వలసదారులు తమ కుటుంబాలకు పంపిస్తున్న చెల్లింపులు అధికంగా ఉన్నాయని తెలుస్తున్నది. వలసదారులు పంపించే ధనంతో దాదాపు 800 మిలియన్ల కుటుంబ సభ్యులు లబ్ధి పొందుతున్నారు. పిల్లల విద్య, పేదరిక నిర్మూలన, కుటుంబ ఆరోగ్యం, పోషకాహారం, గృహ నిర్మాణాలు, కుటుంబాలకు నిలకడ రావడం, అప్పులు తీరడం, అవకాశాలు మెరుగుపడడం, గ్రామీణ అభివృద్ధికి ఊతం ఇవ్వడం ఆర్థిక అసమానతలు తగ్గడం దీర్ఘకాలిక ప్రయోజనాలు కలగడం, కుటుంబ ఆర్థిక స్థితులు బలపడడానికి ఉపయోగపడుతూ ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి ఎంతగానో తోడ్పడుతున్నాయి.

తమ కుటుంబాలను, స్వగ్రామాలను, పిల్లల్ని వదిలి పొట్ట చేత పట్టుకొని విదేశాలకు లేదా తమ దేశంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఆభాగ్యులు ఒంటి పూట తింటూ, అనారోగ్యకర వాతావరణంలో సహితం జీవిస్తూ, తమ పిల్లల బంగారు భవితను స్వప్నిస్తూ, సంపాదించిన ధనాన్ని తమ స్వదేశంలో ఉన్న కుటుంబాలకు పంపించడా ద్వారా దేశాభివృద్ధిలో ఎంతగానో దోహదపడుతున్నారని గమనిస్తూ, వారి సేవలను కొనియాడుదాం, వారి కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉంటూ సహకరిద్దాం.

# సమయపాలన పాటించని ఉద్యోగులపై మేయర్ ఆగ్రహం



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరపాలక సంస్థలో కొంతమంది ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణకు సరైన సమయానికి హాజరు కావడం లేదనే సమాచారంతో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయంలో పలువురు ఉద్యోగులు నిర్ణీత సమయానికి హాజరు కాకపోవడాన్ని గమనించిన మేయర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవలో ఉన్న ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించడం విధిగా భావించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని సూచించారు.నగరపాలక సంస్థలో ప్రజలకు సంబంధించిన అనేక సేవలు ప్రతిరోజూ అందించాల్సి ఉంటుందని, ఉద్యోగులు ఆలస్యంగా రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని మేయర్ పేర్కొన్నారు. ఇకపై అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.అనవసరంగా ఆలస్యంగా హాజరయ్యే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మేయర్ స్పష్టం చేశారు. ప్రజాసేవలో క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా వ్యవహరించడం ప్రతి ఉద్యోగి విధి అని ఆయన పేర్కొన్నారు.ఈ తనిఖీలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హెల్త్ కార్డులను తక్షణమే అమలు చేయాలి.



**జనసైన్యం సిటి**

ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించిన హెల్త్ కార్డుల మార్గదర్శకాలు, స్పష్టమైన విధివిధానాలు రూపొందించి తక్షణమే మంజూరు చేసి అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎం.ఏ.ఖాద్రీ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఖాద్రీ మాట్లాడుతూ మే నెల వేతనం నుండి 1.5 శాతం ఈహెచ్ఎస్ చందా వసూలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మార్గదర్శకాలు రూపొందించకపోవడం శోచనీయమన్నారు. చూస్తుండగానే జూన్ నెలలో కూడా డిడక్ట్ అవుతాయని క్షేత్ర స్థాయిలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల గుండెలు పగిలేలా విలవిల లాడుతున్నారని, వెంటనే అన్ని రోగాలకు చికిత్స అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో అమలయ్యే విధంగా ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల కుదింపు , ఉపాధ్యాయుల రేషనలైజేషన్ విషయంలో పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్య అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 1-9 విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, 60 మంది విద్యార్థులకు 5 గురు ఉపాధ్యాయులు ఉండాలని, ఆపైన ప్రతి 20 మందికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని తెలిపారు. ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని కోరారు. ఉపాధ్యాయుల సంఖ్యలో అసమతుల్యత, పనిభారం తదితర కారణాల దృష్ట్యా కాంప్లెక్స్ సమావేశాలను 6 నుండి 3 కు కుదించాలని ఖాద్రీ కోరారు.

# శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా 36వ డివిజన్‌లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.డివిజన్‌లోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, మురుగు కాలువలు, చెత్త సేకరణ కేంద్రాలను సందర్శించిన మేయర్ అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించడంతో పాటు మురుగు కాలువల్లో నీటి నిల్వలు లేకుండా నిరంతరం శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.నగరంలోని ప్రతి కాలనీ పరిశుభ్రంగా ఉండేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని మేయర్ పేర్కొన్నారు. దోమల వ్యాప్తిని నివారించేందుకు ఫాగింగ్, యాంటీ లార్వా మందుల పిచికారీ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, "పరిశుభ్రమైన కరీంనగర్ నిర్మాణం కోసం ప్రజల సహకారం అత్యంత అవసరం. చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలి. ప్రతి పౌరుడు తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే స్వచ్ఛమైన నగరాన్ని నిర్మించగలుగుతాం" అని అన్నారు.

అనంతరం 22వ డివిజన్‌లో ఇటీవల కురిసిన గాలివాన కారణంగా విరిగిపడిన చెట్ల తొలగింపు పనులను మేయర్ పరిశీలించారు. రహదారులపై పడిన చెట్ల వల్ల ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న చెట్లను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.నగరంలో అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య నిర్వహణకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా నగరపాలక సంస్థ నిరంతరం పనిచేస్తోందని మేయర్ తెలిపారు. నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన, పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ తోట అనిల్, 22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, డివిజన్ ప్రజలు, నగరపాలక సంస్థ అధికారులు, పారిశుధ్య సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.

## అమావాస్య ఎఫెక్ట్.. ముగ్గురు మాత్రమే హాజరు..!



**జనసైన్యం సిటి**

వేసవి సెలవుల తరువాత బడి గంట మోగింది.పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయి. తొలి రోజు సోమవారం అమావాస్య కావడంతో కరీంనగర్ రామ్ నగర్ ప్రైమరీ స్కూల్ కు ముగ్గురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. కరీంనగర్ లోని మంకమ్మతోట దగ్గర్వాడీ ప్రభుత్వ పాఠశాల, రాంనగర్ ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు జిల్లాలోని 616 పాఠశాలలు రీ ఓపెన్ అయ్యాయి. ఉపాధ్యా యులు పిల్లలకు పలు సూచనలు చేశారు.

## లొత్తునూరు ప్రభుత్వ పాఠశాలలో పాఠ్య పుస్తకాల పంపిణీ!



**జనసైన్యం సిటి**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లొత్తునూరు ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి ఆకుల సుమన్ గౌడు ఉప సర్పంచ్ ఓరుగంటి మల్లేష్ గ్రామ కార్యదర్శి మణికంఠ గ్రామ సభ్యులు రెడ్డి .జాను. లక్కం రవి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి. ఉపాధ్యాయులు జయ తదితరులు పాల్గొన్నారు

## దొంగ సంతకాలతో కారుణ్య ఉద్యోగం



**జనసైన్యం సిటి**

కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందడంతో పాటు కారుణ్య నియామకం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం పొందారంటూ ఓ మహిళపై ఆమె సోదరీమణులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.బాధితుల కథనం ప్రకారం.. ప్రభుత్వ ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో కుక్‌గా పనిచేసిన మునిగంటి ఐలయ్య 2018 ఫిబ్రవరి 28న విధుల్లో ఉండగానే మృతి చెందారు. అనంతరం రావాల్సిన కారుణ్య ఉద్యోగం, ఆర్థిక ప్రయోజనాలు, ఇతర ప్రభుత్వ బెనిఫిట్ల విషయంలో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా తమ సోదరి మునిగంటి స్వాతి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందినట్లు పేర్కొన్నారు.తమ సమ్మతి లేకుండానే, తమ పేర్లపై దొంగ సంతకాలు చేసి ధృవీకరణ పత్రం పొందారని ఆరోపించారు. ఆ సర్టిఫికెట్ ఆధారంగా కారుణ్య నియామకంతో ప్రభుత్వ ఉద్యోగం పొందడంతో పాటు ఇతర ప్రయోజనాలు కూడా పొందినట్లు తెలిపారు. ఈ విషయంపై ప్రశ్నించగా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని, ఎక్కడ ఫిర్యాదు చేసినా ఏమీ కాదంటూ దురుసుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టి, సంబంధిత దరఖాస్తులు, అఫిడవిట్లు, సంతకాలు, రికార్డులను పరిశీలించాలని కలెక్టర్‌ను కోరారు.దర్యాప్తులో దొంగ సంతకాలు లేదా తప్పుడు సమాచారం ఆధారంగా ధృవీకరణ పత్రం పొందినట్లు తేలితే బాధ్యులపై, అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.కాగా, ఈ ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ, సంబంధిత రికార్డులు, సంతకాలను పరిశీలించి సమగ్ర నివేదిక అందజేయాలని సూచించినట్లు తెలిసింది.

## కింగ్ ఆఫ్ ఫ్రూట్, గోల్డెన్ ఫ్రూట్, నేషనల్ ఫ్రూట్ - మ్యాంగో




**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

వేసవి కాలం రాగానే మార్కెట్లన్నీ మామిడి పండ్ల రాసులతో కళకళలాడుతాయి. మామిడి కేవలం పండు మాత్రమే కాదని, మన సంస్కృతి, చరిత్రలో ఒక అంతర్భాగంగా భావిస్తున్నాం. భారతదేశంలో 5,000 ఏండ్ల క్రితమే మామిడిని సాగు చేయడం ప్రారంభమైంది. హిందూ పురాణాల్లో మామిడి పండ్లు దేవతలతో ముడిపడి ఉన్నాయి. మామిడి ఆకును శుభంగా భావించిన శుభకార్యాల్లో తోరణాలుగా కూడా కట్టడం ఓ పవిత్రత సంప్రదాయంగా కొనసాగుతోంది. నోరూరించే రుచి, అమోఘమైన వాసన, ఆకర్షణీయమైన రంగు, ఆకట్టుకునే రూపం, దృష్టిని దోచుకునేరిమాణం, అద్భుత పోషక విలువలు, అత్యంత ప్రజాదరణ, వేల ఏండ్ల సాంస్కృతిక గుర్తింపు కలిగిన పండ్లు అనేకం ఉన్నప్పటికీ పండ్లన్నింటిలో మామిడి పండ్లకు ప్రత్యేకమైన స్థానం ఇవ్వబడింది.

**జాతీయ ఫలం – కింగ్ ఆఫ్ ఫ్రూట్ :**

ప్రపంచవ్యాప్తంగా మామిడి పండును "కింగ్ ఆఫ్ ఫ్రూట్" లేదా "పండ్లలో రారాజు" అని పిలవడం జరుగుతున్నది. భారత్‌లో "జాతీయ ఫలం" లేదా "నేషనల్ ఫ్రూట్"గా పిలువబడుతోంది. రుచి, సువాసనల ఆధారంగా భారత్‌లో ప్రధానంగా అల్ఫోన్సా, తోతారురి, బంగినపల్లి, మల్గోవా, దసేరీ లాంటి మామిడి పండ్ల రకాలు ఎంతో ప్రసిద్ధి పొందాయి. ఆసియా దేశాల్లో అధికంగా లభించే పెద్ద ముళ్ల పండు "డూరియన్"ను కూడా ప్రపంచ పండ్ల రాజు అని కొన్ని దేశాలు భావిస్తాయి. ప్రపంచంలో "క్వీన్ ఆఫ్ ఫ్రూట్" లేదా "పండ్లలో రాణి" అనే గుర్తింపును "మాంగోస్టీన్" అనే పండు చేజిక్కించుకుంది.

**మామిడి పండు పోషక విలువలు :**

"మంగీఫెరా ఇండికా" అనబడే శాస్త్రీయ నామం కలిగిన మామిడి పండ్లలో దాదాపు 1,000 రకాలు ఉన్నాయి. అస్సాం, మయాన్మార్ ప్రాంతాల నుంచి ప్రారంభమైన మామిడి పండ్ల ఉనికి నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి అత్యంత ప్రజాదరణ పొందింది. ఫిలిప్పీన్స్‌కు చెందిన "కారాబావో" మామిడి పండ్ల రకం అధిక చక్కెర శాతం, నోటిలో కరిగిపోయే గుజ్జుతో "అత్యంత తియ్యటి మామిడి పండు"గా గిన్నీస్ రికార్డు పొందింది. మామిడి పండ్లలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ ఈ, ఖనిజ పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియ మెరుగుపడడం, రోగ నిరోధకశక్తి పెరగడం, చర్మం/జుట్టుకు మేలు కలిగించడం, గుండె ఆరోగ్యానికి తోడ్పడడం, దృష్టిని మెరుగుపరచడం, మెదడు ఆరోగ్యం పెంచడం, శరీరాన్ని నిర్విషీకరణ చేయడం, బరువును తగ్గించడం, వేడి తగ్గించడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన మామిడి పండ్లు మార్కెట్‌లో అత్యధికంగా దాదాపు కిలో ధర రూ: 3 లక్షల వరకు పలుకుతాయి. ప్రతి ఏటా జూలై 22న భారతదేశంలో "జాతీయ మామిడి దినోత్సవం (నేషనల్ మ్యాంగో డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. జీవితం ఒక మామిడి పండు లాంటిది. కొద్దిగా పులుపు, అతి తీపి గుజ్జు కలిగిన మామిడి పండును భారత దేశపు "బంగారు ఫలం (గోల్డెన్ ఫ్రూట్)"గా కీర్తించబడుతోంది.

**మామిడి ఫలం రాజధాని – మలిహాబాద్? నగరం:**

భారత్‌లోనే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్ద మామిడి ఉత్పత్తి కేంద్రంగా యూపీలోని లక్నో సమీప నగరం మలిహాబాద్?ను "మామిడి రాజధాని" లేదా "క్యాపిటల్ ఆఫ్ మ్యాంగో"గా పిలుస్తున్నాం. భారత్‌లో సాలీనా దాదాపు 230 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి పండ్ల దిగుబడి నమోదు అవుతున్నది. ప్రపంచం మొత్తం మామిడి పండ్లలో 40 - 45 శాతం వాటా ఒక్క భారతదేశానిదే అని గమనించాలి. మామిడి ఉత్పత్తిలో భారత్ స్థానం సుస్థిరంగా ఉన్నది. మలిహాబాద్? నగరం 'దసేరీ మామిడి' రకాలకు ప్రసిద్ధి. బీహార్‌లో లభించే "మియాజాకి" రకం పండ్లను "సూర్యుని గుడ్డు" అని పిలువబడుతూ అత్యంత ఖరీదైన మామిడి పండ్లుగా పేరుగాంచాయి. భారత్‌లో ప్రసిద్ధ మామిడి రకాల్లో దసేరీ, పాండే బంగనపల్లి, పాండే అల్ఫోన్సో, పాండే కేసరి, పాండే లంగ్రా రకాలు ప్రజాదరణ పొందాయి. భారత్‌లో పండే మామిడి పంటలో దాదాపు 25 శాతం కంటే ఎక్కువ యూపీ నుంచే పండుతున్నాయి. యూపీ, ఏపీ, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలు 67 శాతం పండిస్తూ మామిడి ఉత్పత్తిలో ముందున్నాయి.

మామిడి ఉత్పత్తుల్లో పండ్లతో పాటు పచ్చళ్లు, తాంద్ర, పొడి, జామ్, రసం, లస్సీ, క్యాండిల్స్, పల్ప్, ఎండపెట్టిన ఒరుగు ముక్కలు లాంటివి అనేకం మన జీవితాలతో ముడిపడి ఉన్నాయి. మామిడి కాయల ముక్కలను ఉగాది పచ్చడిలో కూడా వినియోగించడం ఆచారంగా వస్తున్నది. మామిడి పండు లేకుండా వేసవిని ఊహించడం కష్టం. మామిడి పండును తినని వారుండరు. మన సంస్కృతి, వారసత్వాలకు ప్రతీకగా నిలిచిన మామిడి పండ్లను ఆస్వాదిస్తూ ఆరోగ్య సౌభాగ్యంతో జీవితాలను సుసంపన్నం చేసుకుందాం.

## యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

**జనసైన్యం సిటి**




హనుమకొండ : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి ఆరోపించారు. సోమవారం నాడు హనుమకొండ బాలసముద్రంలోని ఎఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం హనుమకొండ జిల్లా స్థాయి విస్తృత సమావేశం గిన్నారపు రోహిత్ అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ నిరుద్యోగ యువత జీవితాలను అంధకారంలోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, ప్రభుత్వం నియామక ప్రక్రియలను వేగవంతం చేయడంలో విఫలమైందన్నారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతుండగా, యువతలో నిరాశ, నిస్పృహ పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ట్యూషన్ ఫీజులతో పాటు అడ్మిషన్ ఫీజులు, ప్రత్యేక ఫీజులు, ఇతర అదనపు రుసుముల పేరుతో విద్యను వ్యాపారంగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర వైద్య రంగ పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, అవసరమైన మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులకు తగిన బడ్జెట్ కేటాయించి వాటిని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి పౌరునికి అందుబాటులో ఉండే ప్రజా వైద్య సేవలను ప్రభుత్వం హామీ ఇవ్వాలని కోరారు. ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

**నూతన జిల్లా కమిటీ ఎన్నిక**

ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా అధ్యక్షుడుగా నార్లాపురం రాజు ను, జిల్లా కార్యదర్శి గా గిన్నారపు రోహిత్ ను, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గుగులోత్ సురేష్ ను, ఉపాధ్యక్షులు గా కేతపాక ప్రసాద్, పసునూరి సునీల్ లను, సహాయ కార్యదర్శి గా షేక్ హాజీ ను, కోశాధికారిగా ఈదునూరి కళ్యాణి ని లతో పాటు మొత్తం జిల్లా కమిటీ సభ్యులను 21 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి అభినందనలు తెలియజేస్తూ, యువజన సమస్యల పరిష్కారం, ఉద్యోగాల భర్తీ, విద్యా–వైద్య రంగాల పరిరక్షణ కోసం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో మరింత విస్తృతమైన ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎఐవైఎఫ్ మాజీ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మాస్కా సుదీర్, ఎఐవైఎఫ్ నాయకులు గుగులోత్ సురేష్, కేతపాక ప్రసాద్,షేక్ హాజీ, తాటికొండ ప్రశాంత్, పూజారి నరేందర్, పెనుకుల మధు, రెసోజు రాజు, శ్రీనివాస్, కొత్తపల్లి శ్రీకాంత్, ఈదునూరి కళ్యాణి, మనుకొండ శిరీష, ఈర్ల లావణ్య, కొండోజు అలౌకిక, బోగి రమా, కవిత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త




బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును బుకింగ్ చేసుకోవాల్సిన ఫోన్ నెంబర్ 9246966660



## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు







మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన కార్పొరేటర్ బండారి వేణు



**జనసైన్యం సిటి**
ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆహ్వానం మేరకు కార్పొరేటర్ బండారి వేణు గారు పాఠశాలకు విచ్చేసి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది . ఇందులో స్కూల్ టీచర్స్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

## లక్ష్మి నగర్ అంగన్వాడీ కేంద్రం లో అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం



**జనసైన్యం సిటి**
కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ కోతిరాంపూర్ sector లక్ష్మి నగర్ అంగన్వాడీ కేంద్రం లో అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో cdpo కవిత మాట్లాడుతూ ఈ రోజు నుండి అంగన్వాడీ కేంద్రాలు పున: ప్రారంభించడం జరిగింది అని అన్నారు. ప్రైవేట్ పాఠశాల లకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలలో విద్య బోధన జరుగుతుంది అని ప్రీ స్కూల్ ఆక్టివిటీస్ వలన పిల్లల్లో మేధో శక్తి అభివృద్ధి జరుగుతుంది అని పిల్లలకు మంచి అలవాట్లు, తోటి పిల్లల తో కలిసి ఉండటం లాంటివి అలవాటు అవుతాయి అని అన్నారు. అంగన్వాడీ లో కొత్త ప్రీ స్కూల్ కరిక్యులం వచ్చింది అని ఇప్పుడు అంగన్వాడీ కేంద్రం లో మౌలిక సదుపాయాలు ఉన్నాయి అని ఆహ్లాద కర వాతావరణం లో పిల్లలకు విద్య బోధన జరుగుతుంది అని అన్నారు. 38 డివిజన్ కార్పొరేటర్ దేవసాని సరస్వతి సత్య నారాయణ, మరియు 39 డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ అంగన్వాడీ లో కొత్తగా పిల్లల నమోదు కోసం తమ వంతు సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయి అని ప్రభుత్వ పథకాలు ప్రజలందరూ ఉపయోగించు కోవాలని అన్నారు. కార్యక్రమం చివరలో 5 జూశ్రీబం పిల్లలకు విద్యారంభ సర్టిఫికెట్ పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జణూా కవిత, స్థానిక కార్పొరేటర్లు మాసం గణేష్, దేవసాని సరస్వతి - సత్యనారాయణ, ICDS sup dt. అరుణ, పాఠశాల hm హరీష్, అంగన్వాడీ టీచర్ పద్మ ,RP లు, Anm,పాఠశాల సిబ్బంది,తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫస్ట్ ఇయర్ రాష్ట్ర ప్రథమ ర్యాంకర్‌కు జిల్లా కలెక్టర్ అభినందనలు



జనసైన్యం సిటి

ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని కడారి రశ్మితను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రత్యేకంగా అభినందించారు.సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రశ్మితకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో మొత్తం 470 మార్కులకు గాను 469 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంకు సాధించడం విశేషమని కలెక్టర్ కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతోనే ఇలాంటి అసాధారణ విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జిల్లా పేరును మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని విద్యార్థినికి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, రామడుగు సర్పంచ్ మొయిజ్, రామడుగు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ లో మరణాలపై రాజకీయాలు



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరం. తమ కుటుంబాలను పోషించేందుకు ప్రతిరోజూ ప్రమాదాలతో పోరాడే కార్మికులు ఒక్క క్షణంలో మృతిచెందడం కేవలం ఒక పరిశ్రమ ప్రమాదం మాత్రమే కాదు. అది సమాజం, ప్రభుత్వం, యాజమాన్యం, రాజకీయ వ్యవస్థలన్నింటికీ ఒక గట్టి హెచ్చరిక. కానీ ఇలాంటి విషాద సందర్భాల్లో ప్రజల దృష్టి బాధిత కుటుంబాల కన్నీళ్లపై కాకుండా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు--ప్రత్యారోపణలపై మళ్లిపోవడం మరింత బాధాకరం.



ఒక ప్రమాదం జరిగిన వెంటనే ముందుగా జరగాల్సింది ఏమిటి? బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందాలి. ప్రమాదానికి కారణాలు ఏమిటో స్వతంత్ర విచారణ జరగాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి. కానీ మన రాజకీయ సంస్కృతిలో ఇవన్నీ రెండో స్థానానికి వెళ్లిపోతాయి. మొదటి స్థానంలో ఎవరు తప్పు చేశారు? ఎవరిని విమర్శించాలి? ఎవరు రాజకీయ లాభం పొందాలి? అనే అంశాలే నిలుస్తాయి.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో కూడా అదే జరిగింది. అధికార పార్టీ ఒక వైపు, ప్రతిపక్ష పార్టీ మరో వైపు నిలబడి పరస్పరం నిందలు వేసుకోవడం ప్రారంభించాయి. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఇది ఎంత బాధ కలిగిస్తుందో ఎవరూ ఆలోచించడం లేదు. వారి ఇంట్లో ఒక ప్రాణం పోయింది. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. కానీ రాజకీయ నాయకుల దృష్టిలో అది ఒక మానవ విషాదం కాకుండా ఒక రాజకీయ అవకాశంగా మారిపోవడం మన ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

అధికారంలో ఉన్నవారికి బాధ్యత ఎక్కువ. ఎందుకంటే ప్రస్తుతం పరిపాలన వారి చేతుల్లో ఉంది. పరిశ్రమల భద్రత, తనిఖీలు, కార్మిక సంక్షేమం, ప్రమాద నివారణ చర్యలు సమగ్రంగా అమలవుతున్నాయా లేదా అనే ప్రశ్నలకు వారు సమాధానం చెప్పాలి. ప్రమాదం జరిగిన తర్వాత కేవలం సానుభూతి ప్రకటనలు చేయడం సరిపోదు. గతంలో ఎన్ని భద్రతా తనిఖీలు జరిగాయి? ఎలాంటి లోపాలు గుర్తించారు? వాటిని సరిదిద్దారా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారు ప్రశ్నలకు సమాధానం చెప్పడం బాధ్యత, ఉపకారం కాదు.

అదే సమయంలో ప్రతిపక్షాల పాత్ర కూడా బాధ్యతాయుతంగా ఉండాలి. ప్రతి విషాదాన్ని రాజకీయ లాభం కోసం ఉపయోగించుకోవడం ప్రజలకు విసుగు తెప్పిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడం ప్రతిపక్ష హక్కు. కానీ కేవలం విమర్శలకే పరిమితం కాకుండా పరిష్కార మార్గాలను కూడా సూచించాలి. కార్మిక భద్రతను బలోపేతం చేయడానికి ఏ చర్యలు అవసరమో చెప్పాలి. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ఒత్తిడి తేవాలి. అలా కాకుండా కెమెరాల ముందు విమర్శలు చేసి, కొన్ని రోజుల తర్వాత ఆ అంశాన్ని మరిచిపోవడం ప్రజల సమస్యలను పరిష్కరించదు.

ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న కూడా ఉంది. దేశవ్యాప్తంగా పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలు ఎందుకు పునరావృతమవుతున్నాయి? కార్మికుల ప్రాణాలకు నిజంగా ఎంత విలువ ఇస్తున్నాం? ఉత్పత్తి లక్ష్యాలు, లాభాలు, ఖర్చుల తగ్గింపు పేరుతో భద్రతా ప్రమాణాలు నిర్లక్ష్యం చేయబడుతున్నాయా? అనేక పరిశ్రమల్లో కార్మిక సంఘాలు పదేపదే భద్రతా లోపాల గురించి హెచ్చరిస్తుంటాయి. కానీ ప్రమాదం జరిగే వరకు వాటిని పట్టించుకోరు. ప్రమాదం జరిగిన తర్వాత మాత్రమే అందరూ చురుకుగా మారతారు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ అన్నీ మామూలు స్థితికి చేరుకుంటాయి.

విశాఖ ఉక్కు కర్మాగారం కేవలం ఒక పరిశ్రమ కాదు. అది లక్షలాది ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన సంస్థ. "విశాఖ ఉక్కు-- ఆంధ్రుల హక్కు" అనే నినాదంతో ఎన్నో పోరాటాలు జరిగాయి. అనేక మంది ప్రాణత్యాగాలు చేశారు. అలాంటి సంస్థల్లో కార్మికులు అసురక్షిత పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తే అది కేవలం యాజమాన్యం సమస్య కాదు; ప్రభుత్వాల వైఫల్యాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. భద్రతను వ్యయంగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. ఒక కార్మికుడి ప్రాణం ఏ ఉత్పత్తి లక్ష్యానికన్నా, ఏ లాభానికన్నా విలువైనదే.

ఈ విషాదం మన రాజకీయ వ్యవస్థకు కూడా ఒక అద్దం పట్టింది. ప్రజల కష్టాల సమయంలో రాజకీయ నాయకులు ఎంతవరకు మానవత్వంతో వ్యవహరిస్తున్నారు? అనే ప్రశ్నను ముందుకు తెచ్చింది. ప్రజలు ఇప్పుడు కేవలం పరస్పర ఆరోపణలను వినాలనుకోవడం లేదు. వారు జవాబుదారీతనం కోరుతున్నారు. భద్రతా సంస్కరణలు కోరుతున్నారు. బాధ్యులపై చర్యలు కోరుతున్నారు. బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక భరోసా కోరుతున్నారు.

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులను తిరిగి తీసుకురావడం ఎవరి వల్లా కాదు. కానీ వారి మరణాలు వృథా కాకుండా చేయడం మాత్రం సమాజం చేతిలో ఉంది. అందుకు రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం మానేసి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఏం చేయాలో చర్చించాలి. కార్మిక భద్రతను ఎన్నికల అంశంగా కాకుండా మానవ హక్కుల అంశంగా చూడాలి. అధికార పార్టీ తన బాధ్యతను స్వీకరించాలి. ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. యాజమాన్యం పారదర్శకంగా ఉండాలి.

విషాద సమయంలో రాజకీయ పోరాటాలు ప్రజల గాయాలపై ఉప్పు చల్లినట్లే. ప్రజలకు కావాల్సింది వాదనలు కాదు, బాధ్యత. ప్రకటనలు కాదు, చర్యలు. సానుభూతి మాటలు కాదు, భద్రతా హామీలు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో మరణించిన కార్మికులకు నిజమైన నివాళి అంటే వారి పేరుతో మరికొంత రాజకీయం చేయడం కాదు; ఇకపై ఒక్క కార్మికుడైనా ఇలాంటి నిర్లక్ష్యానికి బలికాకుండా వ్యవస్థను మార్చడం. అదే ఈ విషాదం మనకు నేర్పాల్సిన గొప్ప పాఠం.

## 38వ సారీ రక్తదానం చేసిన పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు




**జనసైన్యం సిటి**

వరంగల్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కన్నె రాజు (స్విమ్మర్ రాజు).రాగంపేట గ్రామం, ఖానాపురం మండలం, వరంగల్ జిల్లా చెందిన కన్నె కుమారస్వామి - రామనీల దంపతులు పెద్ద కుమారుడు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు). రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం అంటూ యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం జూన్ 14, 2026 తేదీ ఆదివారం రోజున ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సుబేదారి, హనుమకొండ లో మెగా రక్తదాన శిబిరం లో నేను 38వ సారి రక్తదానం చేయడం జరిగింది. ఆలకిద్దాం, ఆలోచిద్దాం, ఆచరిద్దాం, ఆదుకుందాం. జీవిస్తూ.. రక్తదానం చేద్దాం !, ప్రాణదానం కల్పిద్దాం !!, మరణిస్తూ.. నేత్రదానం చేద్దాం !, ఇద్దరి అందులకు చూపునిద్దాం !!, శరీరదానం చేద్దాం !, వైద్య విద్యకు తోడ్పడుదాం !! , " బ్రెయిన్ డెడ్ తో అవయవదానం చేసి అభాగ్యులకు ప్రాణం పోద్దాం !! ".రక్తదానం చెయ్యండి !, ప్రాణదాతలు అవ్వండి !! . నేను చేస్తున్న ఈ రక్తదాన చైతన్య యుద్ధ కార్యక్రమంలో భాగంగా మీ అందరి సహాయ సహకారాలతో గత 21 సంవత్సరాలు నుండి నేను స్వయంగా 38 సార్లు రక్తదానం చేయడం జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, హర్యానా ఈ 5 రాష్ట్రాలలో 1,00,000 మందికి పైగా రక్తదానం పై అవగాహన కల్పించడం జరిగింది. నేను ఇప్పటి వరకు అత్యవసర సమయంలో ఉన్న వారి కోసం, తలసేమియా వ్యాధి తో బాధపడుతున్న చిన్నారుల కోసం ఇప్పటి వరకు 80 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. వివిధ అత్యవసర సమయంలో ఉన్న వారికి రక్తదాతల అందరి సహకారంతో 18,546 మంది కీ ఉచితంగా రక్తం అందించడం జరిగింది. అదేవిధంగా (కోవిడ్ - 19) కరోన వ్యాధి సమయంలో ప్లాస్మాదానం పై అవగాహన కల్పించి, కరోన బారిన పడిన వారికి 235 మందికి ఉచితంగా ప్లాస్మా అందించడం జరిగింది. ఇప్పటి వరకు అవయవదానం పై 3 అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది. నేను 38 సార్లు రక్తదానం చేసినందుకు గాను నా యొక్క గురువులు, వరంగల్ పోలీసు ఉన్నత అధికారులు, రాగంపేట గ్రామ ప్రజలు, నా యొక్క మిత్రులు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులు అభినందనలు తెలియజేశారు. నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ, అనునిత్యం నన్ను ప్రోత్సహిస్తున్న నా యొక్క కుటుంబ సభ్యులకు, వరంగల్ పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులకు, నా యొక్క గురువులకు, రక్తదాతలకు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులందరికీ నా యొక్క ప్రత్యేక కృతజ్ఞతలు.

## విద్యార్థులకు ఘన స్వాగతం పలికిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు.



జనసైన్యం సిటి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద మధ్యతరగతి విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే మా ధ్యేయం అని బీజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో సోమవారం రోజు నగరంలోని 42 వ డివిజన్ భగత్ నగర్ పోలీస్ క్వాటర్స్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఘన స్వాగతం పలికారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఇచ్చిన పిలుపు మేరకు బీజేపి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోలీస్ క్వాటర్స్ ప్రభుత్వ పాఠశాలలో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. మొదటి రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఇష్టమైన బెలూన్లు, బొమ్మలు, వివిధ రకాల వస్తువులను అందించి...స్వీట్లు పంపిణీ చేస్తూ... ఎర్రటి కార్పెట్ పరిచి చిన్నారులకు ఘనంగా స్వాగతం పలికారు. ఇప్పటికే గత రెండు రోజుల క్రితమే పాఠశాల ఆవరణను శు భ్రపరిచి మంచి అహ్లాదవాతావరణం కల్పించిగా.. పాఠశాల మొదటి రోజు పేద విద్యార్థుల ముఖంలో సంతోషం, ఉత్సాహం కలిగేలా ఘన స్వాగతం పలికారు. మొదటి రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థుల్లో ఉత్సాహం నెలకొంది.

ఈ సంధర్భంగా డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... విద్యార్థులు పాఠశాలలకు ఆనందంతో వచ్చేలా...పరిశుభ్రమైన వాతావరణం లో విద్యను అభ్యసించాలనే గొప్ప లక్ష్యంతో మా నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు... 42 వ డివిజన్ భగత్ నగర్ పోలీస్ క్వాటర్స్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాల పుణ:ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు మా పార్టీ శ్రేణులతో కలిసి వారికి ఇష్టమైన వస్తువులను అందించి రెడ్ కార్పెట్ పరిచి ఘనంగా స్వాగతం పలికామని అన్నారు. మొదటి రోజు పాఠశాలకు వచ్చిన చిన్నారుల ముఖాల్లో ఆనందం సంతోషం చూడటం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గతంలో కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 26 కోట్ల రూపాయల స్మార్ట్ సిటీ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచినట్లు గుర్తుచేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఆధునిక క్లాస్ రూములు, డిజిటల్/స్మార్ట్ క్లాసులు, స్వచ్ఛమైన తాగునీరు, డైనింగ్ హాళ్లు మరియు మరుగుదొడ్ల వసతులను కల్పించామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయని....విధ్యా ఫలాలు విద్యార్థులకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలను పరిశు భ్రంగా ఉంచుకోవడంతో పాటు ఉపాధ్యాయులు సమర్థవంతంగా సేవలు అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వాలు అందించే మెరుగైన సేవలను విద్యార్థులకు అందించి...రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చే విధంగా విద్యార్థులన్న తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడానికి అన్ని పార్టీల వారు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు, డివిజన్ కు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

ఉన్నత ప్రాథమిక పాఠశాలలు: 2 (175 మంది విద్యార్థులు)

ఉన్నత పాఠశాలలు: 20 (7,004 మంది విద్యార్థులు)

విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ఈ క్రింది ఆహార పదార్థాలు అందించబడతాయి:ఈ పథకం ద్వారా విద్యార్థులకు ఉదయం పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యం, పాఠశాల హాజరు, ఏకాగ్రత మరియు విద్యా ఫలితాలను మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

## కస్తూర్బా పాఠశాలలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు..



జనసైన్యం సిటి

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి జన్మదిన శుభాకాంక్షలు .ఆయన పుట్టిన రోజు సందర్భంగా మొయినాబాద్ కస్తూర్బా పాఠశాల లో వారి యోగా క్షేమాలు తెలుసుకోవడానికి ఇక్కడికి వచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , బీసీ సంక్షేమ శాఖ మంత్రి గా నేను ,ఎస్సీ ఎస్టీ మైనార్టీ గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించడానికి డైట్ ఛార్జీలు పెంచడం జరిగింది..గురుకులాల అద్దెలు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం..గ్రీన్ చానెల్ ద్వారా బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం..కేజీబీవీ ,మోడల్ స్కూల్స్ లకు సొంత భవనాలు ఉన్నాయి..గురుకులాలాల విద్యార్థులకు చలి కాలంలో వేడి నీళ్లతో స్నానం చేసేలా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్న .ప్రాథమిక పాఠశాల ,హైస్కూల్ విద్యార్థులకు ఈరోజు నుండి బ్రేక్ ఫాస్ట్ ప్రారంభించడం జరిగింది..తల్లిదండ్రులు ఉదయమే పిల్లలకి టిఫిన్ చేసే పరిస్థితి లేకుండా స్కూల్ లోనే బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేయడం జరిగింది..సంక్షేమ శాఖ కి సంబంధించి గతంలో పేరుకుపోయిన బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతుంది..విద్యార్థులకు శారీరక ,మానసికంగా ఆరోగ్యంగా ఉండేలా పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుంది..జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని బాగా చదువుకోవాలి..గురుకులాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్న..

## ఆర్చరీలో ప్రతిభ చాటిన సెయింట్ జార్జ్-సిబిఎస్ఈ విద్యార్థిని




జనసైన్యం సిటి

ఇటీవల గోవాలో నిర్వహించిన 1వ అఖిల భారత ఇండోర్ ఆర్చరీ టోర్నమెంట్ - 2026లో కరీంనగర్ లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన చీ.విన్మయి విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో మూడో స్థానంలో సాధించింది. AMATEUR ఆర్చరీ అసోసియేషన్ గోవా ఆధ్వర్యంలో, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (AAI) మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గోవా సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలు మే 24 నుండి 29 వరకు గోవాలోని డి.బి. ఇండోర్ కాంప్లెక్స్, మాపుసాలో జరిగాయి.ఈ టోర్నమెంట్లో ఇండియన్ రౌండ్ విభాగంలో పాల్గొన్న చీ.విన్మయి తన ప్రతిభను ప్రదర్శిస్తూ కాంస్య పతకం (మూడో స్థానం) సాధించి అందరి ప్రశంసలు అందుకుంది.ఈ కార్యక్రమంలో భాగంగా చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విన్మయిని అభినందిస్తూ మరియు తను ఈ విజయానికి ఎంతో సహకరించినటువంటి తమ కుటుంబ సభ్యులకు, క్రీడా శిక్షకులకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## బంగారు భవిష్యత్తు కోసం మీ పిల్లల్ని ప్రభుత్వ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించండి.

**జనసైన్యం సిటి**



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇల్లంతకుంట జూన్ ఒకటవ తేదీన ప్రారంభించబడినది తేదీ 15-06-2026 సోమవారం ఈ రోజు ప్రథమ మరియు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభం అయినవి..మన కళాశాలలో మెరుగు అయిన మౌళిక వసతులు కల్పించడం తో పాటు అనుభవాగ్యులన అధ్యాపకులచే నాణ్యమైన విద్య బోధన జరుగుచున్నవి డిజిటల్ తరగతి గదులు అధునాతన లైబ్రరీ అందుబాటులో ఉన్నవి..మార్చి మరియు మే..2026లో నిర్వహించిన ఇంటర్ మీడియాట్ వార్షిక పరీక్షలలో అన్ని సబ్జెక్టులలో 100శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లలోనే ప్రభుత్వ కళాశాలలో ప్రథమ స్థానంలో ఇల్లంతకుంట మండల జూనియర్ కళాశాల నిలిచినది.. కాబట్టి మండలములో పదవ తరగతి లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎక్కడికో వెళ్లకుండా మన ఇల్లంతాకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ప్రవేశం పొందాలని నాణ్యమైన విద్య ను పొందాలని కోరడమైనది. స్కాలర్షిప్ సౌకర్యం ఉచిత పాఠ్య పుస్తకాలు మొదలగు ఇతర సదుపాయాలు ఉన్నాయని ఇల్లంతకుంట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజు గారు మాట్లాడుతూ అన్నారు...

## ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**జనసైన్యం సిటి**



కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ (ఆపదలో సహాయానికి రా) ఆధ్వర్యంలో మంకమ్మ తోటలోని విద్మహి న్యూట్రిషన్ సెంటర్ సౌజన్యంతో జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని నేడు రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు ఎన్ఎస్-ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరుసగా రెండవ రోజు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజలు రక్తదానం పట్ల అవగాహన కలిగి ఆపదలో ఆదుకోవాలని సూచిస్తూ ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేశారని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యతగా పేర్కొన్నారు. అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్న అని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు రక్తదానానికి అర్హులని తెలియజేస్తూ రక్త కొరత లేని సమాజానికి కృషి చేయాలని సూచించారు. విద్మహి న్యూట్రిషన్ సెంటర్ బాధ్యులు పొన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్థ సభ్యులు ఆరోగ్యం పట్ల సమాజాన్ని అవగాహన కల్పిస్తూ రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు అతినా ఆతిఫ్, పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, బొట్ల శ్యామల కిరణ్, కెపిపి చంద్ర, ఎలైట్ అకాడమీ కోచ్ చిన్న గౌడ్,ఆసరా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ విద్మహి న్యూట్రిషన్ సెంటర్ బాధ్యులు పొన్నం శ్రీనివాస్ ఆసరా ఫౌండేషన్ సహాయ కార్యదర్శి మరియు వెల్నెస్ కోచ్ ఎం రవిచంద్ర తో పాటు వాలంటీర్ కోచ్ లు రవీందర్ మహారాజ్ పూర్ణాకర్ స్వప్న రజిత ప్రతాప్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి.




**జనసైన్యం సిటి**

భారత విద్యార్థి ఫెడరేషన్ SFI కరీంనగర్ కమిటీ జిల్లా ఆధ్వర్యంలో ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గారికి శ్రీ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు, ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం వల్ల కార్పొరేట్ విద్య సంస్థలు వల్ల ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు,అదే విధంగా పాఠశాలలోనే పుస్తకాలు, యూనిఫాం అమ్ముతు వ్యాపారం చేస్తున్న పరిస్థితి ఉంది. జిల్లాలో ఉన్న విద్యాశాఖ అధికారులకు ఎందుకు కనబడడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్పొరేట్ విద్య ఈ రాష్ట్రంలో లేకుండా చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వారే కార్పొరేటు విద్యాసంస్థలను ప్రారంభిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తుంది కావున ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా ఫీజులు నియంత్ర చట్టం అమలు చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. పుస్తకాలను, యూనిఫాం అమ్ముతున్న వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. లేనియడల రాష్ట్ర జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అసంపెల్లి వినయ్ సాగర్, సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, జిల్లా కమిటీ సభ్యులు సన్నీ మానస సంజన కార్తీక్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**జనసైన్యం సిటి**

ప్రభుత్వ పాఠశాలల కళాశాలల సమస్యలను పరిష్కరించాలని మరియు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల కళాశాలల అధిక ఫీజుల దోపిడిని అరికట్టాలని జార్జి రెడ్డి పి.డి.ఎస్. యూ. ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ వాకాడే గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జార్జి రెడ్డి పి.డి. ఎస్. యూ జిల్లా అధ్యక్షులు రత్నం రమేష్ మాట్లాడుతూ... నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపద్యంలో కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని,విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని,తెలంగాణలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, విద్యా ఉపకరణాలు (టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాం etc..) సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని, వసతి గృహాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని జార్జిరెడ్డి ౹ాణాఖ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.అలాగే జిల్లాలో గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న విద్యా సంస్థలను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, నిబంధనలు పాటించని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలను, అలాగే సంబంధిత అధికారులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.ప్రభుత్వ విద్య బలోపేతం, విద్యార్థుల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకొని పై అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని జార్జిరెడ్డి PDSU జిల్లా కమిటీ తరఫున మనవి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో నవీన్ శేఖర్ అజయ్ కిరణ్ లు పాల్గొన్నారు.

## రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ చేసిన కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్



**జనసైన్యం సిటి**

బడి బాటలో మనబడి మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా 49వ డివిజన్లోని కురుమవాడలో గల ప్రభుత్వ రాంనగర్ హై స్కూల్ ప్రారంభ దినం సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలకు ఈరోజు ఉచితంగా పాఠ్యపుస్తకాలు నోటుబుక్కులు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా స్కూల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ అన్న కృషితో పాఠశాలలో ఆరో ప్లాంటును, మరుగుదొడ్లను నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎంఈఓ మరియు స్కూల్ ప్రధానోపాధ్యాయులు భద్రయ్య , టీచర్లు నాగేశ్వరరావు, చంద్రకళ శోభారాణి రమాదేవి ప్రభాకర్ రెడ్డి మంజుల గాయత్రీ దేవి తదితరులు టీచర్లు పాల్గొన్నారు.

# కేరళలో నిఫా వైరస్ అలజడి



**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

2018 నుంచి నిఫా వైరస్ వ్యాప్తి పదేపదే అలజడిని రేపుతూ, దేశవాసులను భయకంపితులను చేస్తున్నది. ఇప్పటి వరకు 24 మంది ప్రాణాలను తీసిన నిఫా వైరస్ విజృంభిస్తే ఏ స్థాయిలో ప్రభావాన్ని చూపుతుందే అంచనాలకు అందడం లేదు. ఈ ఏడాది తొలి నిఫా వైరస్ కేసు కోజికోడ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో 43 ఏండ్ల వ్యక్తికి బయట పడింది. ఈ వైరస్ సోకిన వ్యక్తి 10 జూన్ 2026 రోజున గుర్తించబడి ఐసోలేషన్ వార్డులో వెంటిలేటర్పై విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నాడు. వెంటనే భయపడాల్సినా పని లేదని వైద్యులు చెప్పినప్పటికీ కరోనా విపత్తు చేదు అనుభవాలు నేటి పౌర సమాజానికి కంటి నిండి కునుకు లేకుండా చేస్తున్నది. "హెనిపావైరస్ నిపాహెన్స్" జాతికి చెందిన నిఫా వైరస్ భారతదేశంతో పాటు మలేషియా, సింగపూర్ రోగుల్లో గుర్తించారు. తొలిసారి నిఫా నది ప్రాంతంలో గుర్తించిన కారణంగా దీనికి నిఫా వైరస్ అనే పేరును నిర్ధారించారు.

**నిఫా వైరస్ సోకిన రోగుల లక్షణాలు :**

ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం, టెరోపోడిడే కుటుంబానికి చెందిన పండ్ల గబ్బిలాలు నిఫా వైరస్కు సహజ వాహకాలుగా లేదా అతిథేయ జీవులుగా నిర్ధారించబడ్డాయి. నిఫా వైరస్ సోకిన గబ్బిలాలు, పందులు, పక్షులు, గుర్రాలు, కుక్కలు, పిల్లులు లేదా ఇతర జంతువుల నుండి మానవులకు వ్యాపిస్తున్నది. వైరస్ సోకిన 3 - 14 రోజుల వ్యవధిలో తీవ్రమైన వ్యాధి లక్షణాలు బయట పడతాయి. నేరుగా ఒకరి నుండి మరొకరికి కూడా ఇది వ్యాపించవచ్చని గమనించగలరు. నిఫా వైరస్ సోకిన వ్యక్తులుకు జ్వరం, తలనొప్పి, గందరగోళం, మెదడు వాపు, కండరాల నొప్పులు, వాంతులు, గొంతు నొప్పి, స్పృహలో మార్పులు, ఊపిరితిత్తుల సంబంధ లక్షణాలు (శ్వాస ఇబ్బందులు, దగ్గు) కనుపిస్తాయి. కేరళలో దట్టమైన వృక్ష సంపద ఉన్న ప్రాంతాల్లో ఈ పండ్ల గబ్బిలాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. గబ్బిలాల శరీర ద్రవాలతో కలుషితమైన ఆహారం తినడం కూడా ఈ సమస్యకు దారి తీస్తున్నట్లు గమనించారు. ప్రస్తుతం కేరళ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తున్నది. బాధిత రోగికి దగ్గరి సంబంధం ఉన్న వ్యక్తులను కూడా క్వారంటైన్లో ఉంచి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

చెట్ల నుంచి కోసిన పండ్లను తినే ముందు శుభ్రంగా కడుక్కోవాలి. పక్షులు లేదా జంతువులు కొరికిన పండ్లను తినవద్దని వైద్యులు హెచ్చరికలు చేస్తున్నారు. భోజనం చేసే ముందు చేతులను తరుచుగా శుభ్ర పరుచుకోవడణ మరువరాదు. వ్యాధి సోకిన వ్యక్తులకు 40 - 75 శాతం మరణాల రేటు నమోదు అవడం ఓ ప్రమాదకర అంశంగా చూస్తున్నారు. పచ్చి కర్పూరపు రసం, ఈత కల్లు తాగడం ఉత్తమమని సూచిస్తున్నారు.

## కరెంటు షాక్ వల్ల మరణించిన సందీప్ కుటుంబాన్ని పరామర్శించిన మల్కాజ్గిరి ఎంపీ ఈటల



**జనసైన్యం సిటి**

శనివారం తెల్లవారుజామున టెలికం కాలనీలో విద్యుత్ తీగలు తెగిపడి ఘోర ప్రమాదం జరిగింది. సందీప్ మరియు ఆయన కుమార్తె రీతిక విద్యుత్ షాక్కు గురై మృతి చెందడం అత్యంత బాధాకరం. భార్య కళ్లముందే భర్త, కుమార్తె ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారక సంఘటన. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సరఫరా ట్రిప్ కావాల్సి ఉన్నప్పటికీ గంటన్నర నుంచి రెండు గంటల వరకు ట్రిప్ కాకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. అత్యవసర ఫోన్ కాల్స్ వచ్చినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించకపోవడం బాధాకరం. వర్షాకాలానికి ముందు చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ లైన్లను సురక్షితంగా ఉంచాల్సిన బాధ్యతను అధికారులు నిర్వర్తించలేదు. ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉండేది. ప్రభుత్వం మరియు సంబంధిత శాఖలు ఈ ఘటనను అత్యంత సీరియస్గా తీసుకొని బాధిత కుటుంబానికి అండగా నిలవాలి. కుటుంబ సభ్యులు అనుభవించిన రెండు గంటల వేదన, ఆవేదనను ఎవరూ తీర్చలేరు. మృతుడు.. కుటుంబానికి ప్రధాన ఆధారం, ఆయన మృతితో కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడింది. మృతుడి తల్లి క్యాన్సర్తో బాధపడుతున్నారు. సందీప్ మరణంతో కుటుంబ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సాధారణ ఎక్స్గ్రేషియా కంటే ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. మృతులిద్దరికీ కలిపి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తున్నా. - ప్రతి మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించాలని విజ్ఞప్తి. మృతుడి భార్యకు జీవనోపాధి కోసం ప్రభుత్వంలో, ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో తగిన ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్న. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలి.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాణిక్ రెడ్డి , శ్రీనివాస్ వర్మ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి , బొల్లారం డివిజన్ అధ్యక్షులు అజయ్ రెడ్డి , వెంకటాపురం నియోజకవర్గ రెడ్డి , సర్కిల్ సీనియర్ నాయకులు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ , సంజయ్ ,రాజిరెడ్డి ,మహిళా నాయకులు సుజాత ,కరుణ శ్రీ , మరియు అల్వాల్ సర్కిల్లోని సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# వృద్ధులు వద్దు  ఆస్తులు ముద్దు



వృథాభరితం వృద్ధాప్యం
జీవన సంధ్యా సమయంలో
వృద్ధాప్యం అంతులేని ఘర్షణలకు
ఆవేదనలకు నిలయం
వృద్ధాప్యం శాపం కాదు
అది అనుభవాల ఆస్తి
నైపుణ్యాల నిధి పెద్దరికం నవతరముతో
నగుబాట్లకు గురౌవుతుంది
కోటి ఆశలతో
ఆకాంక్షల లతో కనిపెంచిన
తల్లితండ్రులకు
జీవిత మలిదశ లో
కష్టాలే కానుకలైనాయి
అవమానాలే అభినందనలైనాయి
ఈసడింపులే పలకరింపు లైనాయి
సూటి పోటి మాటలలే
వారి పాలిట ఆత్మీయ స్పర్శ
అయ్యింది
 నిరంతరం శ్రమించిన
త్యాగమూర్తులకు గుక్కెడు
గంజి మెతుకులు కరువైనాయి
ఆత్మీయత కరువై
ఒంటరి తనం ఆస్తి అయ్యింది
నిరాశే తోడు నీడైంది
జవసత్వాలు ఉడిగి
వృ ద్ధాప్యపు బోటుకు
నిరాకరణ నిరాదరణ అనే
చిల్లులు పడ్డాయి
కరుణ కరువై
కాఠిన్యం బరువై
కష్టాలే శరణ్యమై
అనారోగ్యమే సంపదై
కలలన్నీ కన్నీరై
ఆశలన్నీ ఆవిరై
జీవితం మలిదశ లో
ఆపన్న హస్తశీకోసం
ఎదిరిచుస్తున్న వృద్ధులను
ఆదరిద్దాం
కనిపించని దైవాలను పూజిస్తు
కనిపెంచిన ప్రత్యక్ష దైవాలకు
నరకం చూపిస్తున్న యువతరం
మారాలి
వృద్ధుల అనుభవసారాన్ని త్రుణీకరించే
అనాగరిక అనైతిక పొకడలను
అరికట్టాలి
మనిషి అహాన్ని వీడి
సంపద పై దురాశ వీడి
ప్రేమ పూర్వక పలకరింపు
ఆత్మీయ స్పర్శతో
వృద్ధుల హక్కుల రక్షణ లో
తరించండి
వృద్దులు వద్దు ఆస్తులే ముద్దు అనే
వైఖరి యువత విడనాడాలి
మానవీయ విలువలతో
సంస్కారం తో "పెద్దరికానికి"
"పెద్ద పీట"వేయ్యాలి
వృద్ధులను కంటికి
రెప్పలా కాపాడుకోవాలి

నేదునూరి కనకయ్య

## కోతి రాంపూర్ సెక్టర్ లో అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' ర్యాలీ



**జనసైన్యం సిటి**

కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ కోతిరాంపూర్ సెక్టార్ పరిధిలోని లక్ష్మి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభాన్ని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు , కార్పొరేటర్లు మాసం గణేష్ , దే వసాని సరస్వతీ సత్యనారాయణ కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సిడిపిఓ  కవిత మాట్లాడుతూ, నేటి నుండి అంగన్‌వాడీ కేంద్రాలు పునఃప్రారంభమైనట్లు ప్రకటించారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా అంగన్‌వాడీ కేంద్రాలలో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని ఆమె స్పష్టం చేశారు. కేంద్రాల్లో ప్రవేశపెట్టిన కొత్త ప్రీ–స్కూల్ కరికులమ్, లభిస్తున్న మౌలిక సదుపాయాలు పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఇక్కడి ప్రీ–స్కూల్ యాక్టివిటీస్ ద్వారా పిల్లల్లో మేధోశక్తి పెరగడమే కాకుండా, మంచి అలవాట్లు, తోటి పిల్లలతో కలిసిమెలిసి ఉండే గుణం అలవడుతుంది." అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న 38వ డివిజన్ కార్పొరేటర్ దేవసాని సరస్వతి – సత్యనారాయణ, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలలో కొత్తగా పిల్లల నమోదు (అడ్మిషన్లు) పెంచేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి అద్భుతమైన పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

విద్యారంభ సర్టిఫికెట్ల పంపిణీ

కార్యక్రమం ముగింపులో భాగంగా, అంగన్‌వాడీ విద్యను పూర్తి చేసుకుని ప్రాథమిక పాఠశాలల్లో చేరడానికి సిద్ధంగా ఉన్న 5 ప్లస్ (5o) సంవత్సరాల పిల్లలకు ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా 'విద్యారంభ సర్టిఫికెట్లను' పంపిణీ చేశారు.

కార్యక్రమంలో సిడిపిఓ కవితతో పాటు, కార్పొరేటర్లు మాసం గణేష్, దేవసాని సరస్వతి – సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎస్. అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరీష్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆర్పీలు, ఏఎన్ఎం, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు , స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల తొలగింపును అడ్డుకుంటాం



**జనసైన్యం సిటి**

చొప్పదండి నియోజకవర్గ BLA  2 బూత్ లెవెల్ ఏజెంట్ 2 శిక్షణా కార్యక్రమం నేడు ౫ఖ కన్వెన్షన్ లో నిర్వహించడం జరిగింది. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా మేడిపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పిసిసి ఉపాధ్యక్షులు కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల సమన్వయ కర్త నమిండ్ల శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తో పాటు చొప్పదండి నియోజకవర్గ బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు ఇతర ముఖ్య నేతలు హాజరైనారు. పిసిసి సమన్వయకర్త నమిండ్ల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ పక్షాన దీూూ 2 లుగా నియమితులైన వారికి శిక్షణ ఇవ్వడం జరిగింది. చొప్పదండి నియోజకవర్గంలోని 6 మండలాలు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలు, ఈ ప్రాంతంలో ఈ ప్రాంతంలో  SIR పేరుతో చేపట్టే ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో అయినప్పటికీ ఈ విషయంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ కనబరచవలసి ఉంటుందని మండల కాంగ్రెస్ అధ్యక్షులు తెలియజేసినారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా S.I.R స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రివిజన్ గురించి వివరించడంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని దక్షిణాది రాష్ట్రాల్లో బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అనుకూల ఓట్లను తొలగించే ప్రక్రియను చేపడుతుందని, ఈ విషయమై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించవలసిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ దీూూ 2 ల పై ఉందని వెల్లడించారు. నమిండ్ల శ్రీనివాస్  మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు మంత్రులు వెళ్లలేరు కానీ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా పేరు తెచ్చుకున్న సత్యం గారు దుబాయ్ వెళ్లి మృతదేహాలను తరలించడంలో కృషి చేయడం, మృతుల కుటుంబాలకు భరోసా కల్పించడం అభినందించదగ్గ  విషయం.

భారత రాజ్యాంగంలో సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు కల్పించిన ఒక ఓటు హక్కు..

బీహార్ నుండి మొదలు పెడితే ప్రతిపక్ష పార్టీలు ఉన్న ప్రతి చోట ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని బిజెపి పోచోటికి పాల్పడుతుంది.. దీనిపై భారత ప్రతిపక్ష నేత కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ గారు కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించడం జరిగింది.

పశ్చిమ బెంగాల్లో ఇటీవల జరిగిన ఎన్నికలలో భాగంగా దాదాపు 65 లక్షల ఓట్లు తొలగించడం జరిగింది, అదే మాదిరిగా మన రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అనుకూల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నాను .ఎలక్షన్లు పూర్తి అయిన వెంటనే పశ్చిమ బెంగాల్లో ఈవీఎం బాక్సను తగలబెట్టినారు .ఈ విధమైన సంఘటనల పట్ల కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అప్రమత్తమయింది.మీనాక్షి నటరాజన్ గాందేయ వాది వారు వేసిన రాజ్యసభ నామినేషన్ ను ఉద్దేశపూర్వకంగా తిరస్కరించినారు అంటే రేపు మన ఓట్లను కూడా తొలగించే ప్రయత్నం చేస్తారు.చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం గారిని మరోసారి గెలిపించుకోవాలంటే పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో బలంగా ఉండాలి అంటే ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలి.ప్రభుత్వ పరంగా ఎన్నికల సంఘం వారిచే బూత్ లెవెల్ ఆఫీసర్ ఉంటారు. మన కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా బూత్ లెవెల్ ఏజెంట్ 2 ఉంటారు, బూతులు ఆఫీసర్లు మీ వద్దకు వచ్చి ఎన్యూమరేషన్ ఫార్మ్స్ ఇస్తారు, ఒక ఇంటిని వారు మూడు సార్లు సందర్శించవలసి ఉంటుంది, ఒక చిన్న కారణం చేతను ఓటర్ను తొలగించే పరిస్థితి రాకుండా మనం జాగ్రత్త వహించాలి, బూతులు ఏజెంట్ ద్వారా బూతులు ఆఫీసర్ కు మన ఓటర్ యొక్క సమాచారం వివరాలు అందించాలి.

బూతులు ఆఫీసర్ల ద్వారా మనం సమర్పించే ఎన్నిమరేషన్ ఫారంలో ఇలాంటి తప్పులు లేకుండా చూడాలి కొద్దిపాటి చిన్న పొరపాట్లతో ఓటు తొలగించే అవకాశం ఉంటుంది.

రాష్ట్రస్థాయిలో ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా స్థాయిలో ఎన్నికల అధికారి, మండల రిటర్న్ అధికారి  బూత్ లెవెల్ అధికారి ఉంటారు, వీరందరూ సమన్వయం చేయడం కోసం మన కాంగ్రెస్ పార్టీ పక్షాన అదే బూత్ లో ఓటర్ అయి ఉండి అదే ప్రాంతానికి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్ ఉంటారు. బి ఎల్ ఏ అందుబాటులో లేని సందర్భంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పర్యవేక్షణ చేయవలసి ఉంటుంది. ౫X= ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఫారం 6,7,8 తో పాటు ఈ విషయానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన బుక్ లెట్ అందజేయడం జరుగుతుంది, ముఖ్యంగా నిరక్షరాస్యులకు పార్టీ శ్రేణులు పూర్తి సహకారాలు అందించవలసి ఉంటుంది.జులై 31 తర్వాత ముద్రించబడిన ఓటర్ లిస్టులలో అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. 30 రోజులపాటు మేము మీకు అందుబాటులో ఉంటాము, ఇలాంటి సందేహాలు ఉన్న నియోజకవర్గస్థాయిలో స్థానిక ఎమ్మెల్యేను మండల కాంగ్రెస్ అధ్యక్షులను సంప్రదించవచ్చు.ప్రతి గ్రామంలో ప్రతి బూతులు ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర ఓటర్ సవరణ విషయంలో బూత్ లెవెల్ ఆఫీసర్ల పనితీరును కాంగ్రెస్ పార్టీ  బూత్ లెవెల్ ఏజెంట్లు పర్యవేక్షించడం పరిశీలించడం పట్ల బాధ్యత ఉంటుంది అని అన్నారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి  పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో ప్రతి బూతులు సముద్ర ఓటరు సవరణ ప్రక్రియ కొనసాగుతుంది.. బూతులు భాగంగా ఏ ఒక్కరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడవలసిన బాధ్యత మనందరిపై ఉంది.

సమగ్ర ఓటర్ సవరణ ప్రక్రియకు సంబంధించి పిసిసి అధ్యక్షులు నమిండ్ల శ్రీనివాస్  మనకు వివరించడం జరిగింది.

కార్యక్రమానికి హాజరైన బ్లాక్ మండల పట్టణ గ్రామ అధ్యక్షులకు ప్రజాప్రతినిధులకు నామినేటెడ్ పదవులలో కొనసాగుతున్న వారందరికీ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు.

సరిగ్గా రెండు సంవత్సరాల కిందట ఈ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజాపాలన ఏర్పడి దేశంలో ఈ ప్రభుత్వం ఏ పార్టీ చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు జరుపుకుంటున్నాం మనం. గత ప్రభుత్వం నాడు సుమతి సోనియా గాంధీ గారు మిగులు బడ్జెట్ తో కూడిన తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే 10 ఏళ్లు పరిపాలించిన బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని ఏడు ఎనిమిది లక్షల కోట్ల అప్పులకు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా చేసింది. అయినప్పటికీ ఇచ్చిన మాట మేరకు ఏ ఒక్క సంక్షేమ పథకం అప్పుల పేరుతో ఆర్థిక భారంతో ఆగిపోకూడదని రెండు లక్షలు రైతు రుణమాఫీని ఏకకాలంలో చేసిన పార్టీ ఈ భారత దేశంలో కేంద్రం కాంగ్రెస్ పార్టీ తరపున మాత్రమే సాధ్యమైంది, గతంలో కెసిఆర్ వరేస్తే ఉరే అన్నారు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మీరు వరి పండించండి సన్న వడ్లు పండించిన రైతులకు 500 రూపాయల బోనసిచ్చి సోదరులకు అండగా నిలబడడం జరిగింది. ఈ రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం కల్పిస్తున్నది రేవంత్ అన్న సర్కార్ .

10 ఏళ్లు బిఆర్ఎస్ ప్రభుత్వానికి అధికారం ఇస్తే ఈ చొప్పదండి నియోజకవర్గంలో ఒక్క పేదోడికి కూడా ఒక్క గుడిస కూడా కట్టి ఇవ్వలేదు, కాంగ్రెస్ సర్కార్ ఈ నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించింది, ప్రతి గ్రామంలో నేడు ఉన్న ఇళ్ల గృహప్రవేశాలు జరుపుకొని సొంతింటి కల నెరవేర్చుకున్న ప్రజలు సంతోషంగా ఉన్నారు.రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం పై దుష్ప్రచారాలు చేస్తున్నారు. తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని గౌరవిస్తూ తెల్ల రేషన్ కార్డు ఉన్న  అందరికి ఉచితంగా సన్నబియ్యం అందజేస్తూ పేదవాడి కడుపు నింపుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం.నాకు ఓటు వేసి గెలిపించిన చొప్పదండి నియోజకవర్గ ప్రజలందరికీ పాదాభివందనం చేస్తున్నాను.నాకోసం జెండాలు పార్టీలు పక్కన పెట్టి పనిచేసిన ప్రతి ఒక్కరికి వారి రుణం తీర్చుకోవడానికి పనిచేస్తాను.నియోజకవర్గ అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో మాట్లాడడం జరిగింది, దానికి వారు అన్ని రకాల సహకరిస్తామని తెలిపినారు.

ఈ నియోజకవర్గ రైతంగానికి కుడి ఎడమ కాలువలు నిర్మాణం పూర్తి చేసి ఆ నీళ్లతో చొప్పదండి నియోజకవర్గ రైతన్నల కాళ్లు కడుగుతాం. బిఆర్ఎస్ పార్టీ నేతలే వారి పార్టీ నేతలపై కేసు పెట్టుకొని ఆ కేసులను తప్పుదోవ పట్టిస్తున్నారు.గత పాలకులు ఏం పని చేసినారు, కమిషన్ల కోసం ఏ పనులు చేసినారు, ప్రతిఫలం ఆశించకుండా ఇచ్చిన మాట కోసం నన్ను గెలిపించిన ఈ ప్రజల కోసం నేను ఏమి పని చేస్తున్నాను నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారు. నేను ఎవరి ప్రలోభాలకు లొంగే వ్యక్తిని కాను, ఐదు సంవత్సరాలలో నేను చేసే పని నాకు కొలమానం అవుతుంది.గతంలో కొండగట్టులో రోడ్డు ప్రమాదం జరిగి 150 మంది మృతి చెబితే నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. కానీ ఇటీవల కొండగట్టులో అగ్నిప్రమాదం జరిగితే కేవలం 42 రోజులలో బాధితులకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేత నష్టపరిహారం అందించడం జరిగింది.ఎవరు ఎన్ని కుట్రలు చేసినా చివరి ఊపిరి ఉన్నంతవరకు నియోజకవర్గ ప్రజల కోసం పనిచేస్తాను.గతం కంటే రుక్మిణి గారితో నన్ను గెలిపించే కాంగ్రెస్ పార్టీ సైనికులు ఇప్పుడు ఉన్నారు .మండలంలో పబ్లిక్ స్కూల్ తీసుకొచ్చినాము, నారాయణపూర్ రిజర్వాయర్ కోసం 23 కోట్ల రూపాయలు తీసుకువచ్చాము, బోయినపల్లికి మినీ స్టేడియంలో మంజూరు చేయించాము, గంగాధర లో డిగ్రీ కళాశాల మంజూరు చేయించాము, బిఆర్ఎస్  నేతలు వారి ప్రభుత్వ హయాంలో ఏమి చేసినారో చెప్పాలి.ఇప్పటికైనా విపక్షాలు బుద్ధి తెచ్చుకొని ఈ నియోజకవర్గం పట్ల ప్రేమ ఉంటే అభివృద్ధికి సహకరించాలి.ఎస్ ఐ ఆర్ పశ్చిమబెంగాలలో ఈ ప్రక్రియ ద్వారా ఓట్లను తొలగించి బిజెపి అధికారంలోకి వచ్చింది. ఒక బూతు నుండి 10, 20 ఓట్లు తొలగించిన దాని ప్రభావం చాలా ఉంటుంది.. అందుకే కాంగ్రెస్ సైనికుడు వారి అధ్యక్షుడిగా బాధ్యతలు భుజాలపై ఎత్తుకొని ఈ సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమంలో క్రియాశీలకంగా పని చేయాలి అని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో నాయకులు ఉప్పుల అంజని ప్రసాద్, పులి ఆంజనేయులు గౌడ్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కర్ర సత్య ప్రసన్న రెడ్డి , ముత్యం శంకర్ గౌడ్,, అన్నమనేని నరసింహారావు వెలిచాల తిరుమలరావు, మహేష్, బత్తిని శ్రీను, సునీత, కొల రమేష్,రామిడి రాజిరెడ్డి,జవ్వాజి హరీష్, మంథని మహేందర్, కూస రవీందర్,పురం రాజేశం, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, బుచ్చన్న,పంజాల వెంకటేశ్వర్లు గౌడ్, సువీన్ యాదవ్, నేరెళ్ల ఆంజనేయులు గౌడ్, ముద్దసాని రంగన్న, దారం ఆదిరెడ్డి, దూస రాజమౌళి, భూషణ వేణి తిరుపతి, భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, వెన్నెల రమణారెడ్డి,మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్



**జనసైన్యం సిటి**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ సందర్శించారు. కళాశాల భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన కెమిస్ట్రీ, ఫిజిక్స్, కంప్యూటర్ ల్యాబ్ లను ప్రారంభించారు. ఈనెల 17వ తేదీ నుండి ప్రారంభం కానున్న టీజీ ఈసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ సెంటర్ ను హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలకు ఇచ్చారని ఈ సందర్భంగా విసి ఉమేష్ కుమార్ తెలిపారు. అదేవిధంగా టీజీ ఈపీసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ సెంటర్ కూడా ఈనెల 19 నుండి కళాశాలలో ప్రారంభమవుతుందన్నారు. హుస్నాబాద్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ సిఎస్ఈ, సిఎస్ఈఏఐ, ఈసీఈ, ఐటి మొత్తం నాలుగు కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి కోర్సుకు సంబంధించి 60 సీట్లు చొప్పున మొత్తం 240 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాలలో విద్యార్థులకు ల్యాబ్స్ తో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కళాశాల నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం 36 ఎకరాల స్థలాన్ని కూడా యూనివర్సిటీకి ఇచ్చిందని, భవన నిర్మాణానికి వచ్చే నెలలో మంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు హుస్నాబాద్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



**జనసైన్యం సిటి**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శిశుమందిర్ పాఠశాలలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థులకు అవసరమైన సదుపాయాల లేమి వంటి సమస్యలు కొనసాగుతున్నప్పటికీ వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు.

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ విచ్చలవిడిగా కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని, దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య భారంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రోత్సాహం లభిస్తోందనే భావన ప్రజల్లో ఏర్పడుతోందని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను తగ్గించి ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో కొద్ది పాఠశాలలకే పరిమితం చేసే ప్రయత్నాలను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు అభ్యంతరం లేదని, అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి రెండు లేదా మూడు మండలాలకు ఒకే పాఠశాలను ఏర్పాటు చేయడం వల్ల పేద, గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల కొనసాగించడం విద్యార్థుల హక్కు అని, ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విలీన ప్రక్రియపై పునరాలోచన చేసి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నగర ఉపాధ్యక్షులు సంతోష్, అంజి, శరత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్య యుగకర్త శ్రీశ్రీ గూర్చి ఎంతో నేర్చుకుందాం



వడ్డేపల్లి మల్లేశం

**తెలుసని విర్రవీగడం మరిచి రచయితలుగా, పాఠకులుగా సమాజానికి మన కృషిని కొంతైనా అందిద్దాం.శ్రీశ్రీ కదే సంస్మరణ .**

శీతకాలం జీవించినం అన్నది ముఖ్యం కాదు. ఎంత అర్థవంతంగా, ఆమోదయోగ్యంగా సామాజిక ప్రయోజనకరంగా బ్రతికినామన్నదే కొలమానం. అశేష జీవరాశులలో మానవునికి ఉన్నటువంటి ఉత్కృష్టత ఆలోచన వివేచన అన్వేషణ తో పాటు పరోపకార జీవితం సమాజ హితాన్ని ఆశించడం వల్లనే. ఆ కోణంలో జీవించిన వాళ్ళు వ్యవస్థ ఉన్నంతవరకు ఏదో ఒక రూపంలో జ్ఞాపకం ఉంటారు జీవిస్తారు అందుకే వాళ్లను మృత్యుంజయులు అంటారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వాల్లు రాజకీయ, సామాజిక, సాహిత్య, శాస్త్రీయ, వైద్య, విద్య తదితర రంగాలలో నైపుణ్యం సాధించిన వాళ్లతో పాటు నిరక్షరాశులై వ్యవస్థ కోసం తపన పడ్డ వాళ్ళు కూడా కోకొల్లలు.తనకాంటూ మనిషి చరిత్ర సృష్టించుకోవాలి అన్న మాజీ ప్రధాని నెహ్రూ కోవలో సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేర్చి సమాజ హితం కోసం సాహిత్యం అని రుజువు చేసినటువంటిశ్రీశ్రీ ఆధునిక యుగ కర్తగా నిలిచినాడనేది జగమెరిగిన సత్యం. ఒక్కసాహిత్య రంగంలోని వారికి మాత్రమే కాదు మనిషిగా పుట్టిన ప్రతి మనిషికి ఉండవలసిన కనీస లక్షణం సామాజిక స్పందన అని ఆయన జీవితం మనలను హెచ్చరిస్తూనే ఉంటుంది.

ప్రముఖ తెలుగు కవిగా, హేతువాదిగా, నాస్తికుడిగా, అభ్యుదయ రచయితల సంఘంతో పాటు విప్లవ రచయితల సంఘాన్ని స్థాపించి దానికి అధ్యక్షునిగా పనిచేసే సాహిత్య సేవ ద్వారా ప్రజల్లో త లలోని నాలుకల జీవించవచ్చు నని రుజువు చేసిన ఆయన జీవితం అపరిమితంగా అధ్యయనం చేద్దాం. పరిమితంగానైనా ఆచరించి సామాజిక సాహిత్య సాంస్కృతిక సేవలో పునరాంకితమవుదాం. పాఠకులుగా రచయితలుగా సామాజిక రుగ్మతలు మరీ విచ్చలవిడిగా జడలు విప్పుతున్న ప్రస్తుత తరుణంలో మనం కూడా అదే స్థాయిలో సామాజిక మార్పు కోసం పునరశీ కితం కావడానికి ఆయన కృషి, సేవ, ధైర్యం, సామాజిక అవగాహన, సంస్కరణ, తోడ్పడుతుందని ఆశిద్దాం.

## శ్రీశ్రీ రచన ధోరణి సామాజిక అవగాహన

1950లో మొదటిసారిగా ప్రచురించిన మహాప్రస్థానం కావ్యం శ్రీశ్రీ ని ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యున్నత స్థానంలోనిలిపింది. సామాజి క అంశాలే కవితా వస్తువుగాఆ కాలంలో తను రాసిన ప్రతి కావ్యం కూడా ప్రజా దృక్పథంతో మార్క్సిజం దృక్కోణంలో రాసినవే అని ఆయనకు ఆ తర్వాత చాలా కాలానికి కానీ తెలియలేదన్నాడు. స్వయంగా శ్రీశ్రీ మాటల్లో ... "ఈ వాస్తవాలు అన్నింటికీ నేను స్పందించిన ఇలాంటి రచనలను సామాజిక వాస్తవికత అంటారని దీని వెనుక దన్నుగా మార్క్సిజం అనే దార్సనికత ఒకటి ఉందని అప్పటికి నాకు తెలియదు. ఇప్పుడు ఒక్కసారి తిరిగి చూసుకుంటే మహాప్రాస్థానం గీతాలలోని మార్క్సిస్టు స్పూర్తి, సామాజిక స్పృహ యాదృచ్ఛికాలు కావని వాస్తవాలనుండి ఉబికి వచ్చినాయి అని తెలుస్తుంది" అంటే సాహిత్య రంగంలో ఎంత ముందు చూపు ఉందో అర్థమౌతుంది. మహాప్రస్థానం ప్రచురించిన 20 సంవత్సరాల తర్వాత వెలుగు చూసిన ఈ అభిప్రాయాన్ని బట్టి సహజంగా సామాజిక చింతన సామాజిక సమస్యలే వస్తువుగా ప్రజా జీవితము చుట్టూ అల్లిన రచనల్లో మార్క్సిజం అంతర్భాగమని చెప్పకనే చెప్పినట్లయినది. అంటే ప్రజా దృక్పథం, సామాజిక చింతన,అవగాహన ఉన్న ప్రతి వ్యక్తి కూడా ఏదో రకంగా సమాజం కోసం తపనపడ్డవాళ్ళు మార్కసిజాన్ని అంతర్గతంగా జీర్ణించుకున్న వాళ్లే అని చెప్పవచ్చు.. సాధారణంగా రచయితలు తాము నమ్ముకున్న సిద్ధాంతానికి అనుగుణంగా సాహిత్య సృజన చేస్తుంటారు కానీ దానికి కొంత భిన్నంగా శ్రీ శ్రీ తనదైన శైలిలో "ప్రగతి" అనే వార పత్రికలో ప్రశ్నలు జవాబుల శీర్షికన పాఠకుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా సాహిత్యం యొక్క ప్రయోజనాన్ని మరింత విస్తృతం చేసినట్టు తెలుస్తున్నది. వ్యక్తికి బహువచనం శక్తి అని అల్పాక్షరాలలో అధిక ప్రాధాన్యత ఉన్న వాక్యాలుగా సృజించిన శ్రీశ్రీ అల్పాక్షరాల ద్వారానే తన సాహిత్యానికి పెద్ద పీట వేసినట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినిమా రంగంలో మాటలు పాటల రచయితగా స్థిరపడి ఉద్రేకాన్ని ఉత్తేజాన్ని చైతన్యాన్ని కర్తవ్యాన్ని తెలియజేసే సినిమా పాటలు రాసి తెలుగు ప్రేక్షకుల అలరించిన సందర్భాలు అనేకం .తన రచన వ్యాసంగాన్ని ఏడవఏటా ప్రారంభిస్తే మొదటి గేయాల పుస్తకం ఎనిమిదవ ఏట ప్రచురించబడింది అంటే ఎంత శ్రద్ధ పట్టుదల ఉందో అర్థం చేసుకోవచ్చు.





18వ ఏట 1928లో "ప్రభావ" కావ్యసంపుటిని సాంప్రదాయ పద్ధతిలో రాసినప్పటికీ గ్రాంథిక శైలి చందస్సును పక్కనపెట్టి వ్యవహారిక భాషలోకి రావడంతో తన సాహిత్య జీవితమే మారిపోయి ఆధునిక విప్లవ కవిత్వానికి యువకర్తగా నిలిచిపోయాడు కూడా. సినిమా రంగంలో చేరినప్పుడు 300 రూపాయలకే నెలసరి ఉద్యోగిగా మద్రాస్ లో అస్థాన రచయితగా పనిచేసి అనుభవాన్ని చతురతను సంపాదించుకొని ఆ పునాది మీద సమాజ మొత్తాన్ని నడిపించిన తీరు ఎందరికో ఆదర్శం. బాధ్యతలను గుర్తింప చేయడం మాత్రమే కాదు నికృష్టమైన జీవితా అనుభవాల నుండి మాత్రమే నిండైనా మూర్తి మొత్తం సాధ్యమవుతుందని చెప్పడానికి కూడా ఆయన ఒక ప్రతీక.

## సాహిత్య సాంస్కృతిక రంగాల్లో కొన్ని వివాదాలు

సహజంగా శ్రీ శ్రీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించినాడని ప్రజల కనీస హక్కుల రక్షణకు అవకాశం ఇవ్వలేదని ఒక విమర్శ ఉంది. అదే సందర్భంలో ఈ ధోరణి సమర్థించే వాళ్ళు ప్రాంతాల కతీతంగా వ్యవహరించాల్సి ఉంటుందని అంతిమంగా సామాజిక పునరుద్ధరణ మహోన్నతమైనదని సమర్థి శీ చుకున్న వాళ్ళు లేకపోలేదు. ఇటీవల ఆంధ్రప్రదేశ్కు చెందినటువంటి ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని రవీంద్ర భారతి ముందు నిలబెట్టడం అలాగే ఎన్టీ రామారావు విగ్రహాన్ని హైదరాబాదులో ఇటీవలనే నెలకొల్పడం తెలంగాణ వాదం పై జరుగుతున్న దాడి అని కొందరు అంటూ తెలుగు వారిలో తెలంగాణకు చెందిన మహానుభావులు ఎందరో ఉన్నారు కదా! వారి విగ్రహాలు ఆంధ్రాలో ఉన్నాయా? అని ప్రశ్నిస్తున్న వారు కూడా లేకపోలేదు. అందుకే తెలుగు భాషకు సంబంధించి రాజకీయ నాయకులు సాహితీ సామాజిక రంగాల నిపుణుల విగ్రహాలు రెండు రాష్ట్రాలలో ఉంటే తప్పేమీ లేదు కానీ తెలంగాణ వారిని ఆంధ్రప్రదేశ్లో చూడమని అనుకుంటే మన విశాల అవగాహనకు అర్థం లేనట్లే. అహంకారానికి నిదర్శనమే అవుతుంది.

## శ్రీ శ్రీ గూర్చి ప్రముఖుల ప్రశంసలు

- మహా ప్రస్థానం ఈ శతాబ్దంలో తెలుగులో వచ్చిన ఏకైక మహాకావ్యం -పురిపండ అప్పలస్వామి

-- కృష్ణశాస్త్రి బాధా ప్రపంచానికి బాధ ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ --- చలం

--తెలుగు కవిత చరిత్రలో తిరుగులేని మలుపు మహాప్రస్థానం -డాక్టర్ పాపినేని శివశంకర్

--కనీసం 1000 సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యంలో కవితను ఇలా నిర్వచించి ఇంత కవితాత్మకంగా వర్ణించి ఇంత అద్భుత సృష్టి చేసిన మరోకవి లేనే లేడు ఇదే అతన్ని సా సాహితీ శిఖరాగ్రాన నిలిపింది.

.. -- బూదరాజు రాధాకృష్ణ

--శ్రీ శ్రీ పుట్టుకతో మనిషి వృద్ధాప్యంలో మహర్షి మధ్యలో మాత్రమే కవి ఎప్పటికీ ప్రవక్త-- వేటూరి

## శ్రీ శ్రీ వ్యక్తిత్వం సాహిత్యం

మానవత్వం సామాజిక అవగాహన మార్క్సిస్టు దృక్పథం గురించి మనం తెలుసుకున్నది రేఖా మాత్రమే. కానీ మనలో భావావేశం ఆలోచన ఉద్రేకం సామాజిక పరివర్తనకై తపన సామాజిక బాధ్యత నిర్వహించాలని ఆరాటం కొట్ట వచ్చినట్లు కనపడుతుంది కదా! ఇదే లక్షణాలు గొప్ప వాళ్లకుంటాయి. నిరంతరం సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటారు కనుక మనం కూడా ఆ వరుసలో నిలబడదాం. ఎప్పుడో ఒకసారి గమ్యాన్ని చేరుకుందాం.




## రన్నింగ్ కాలమ్



కయ్యానికి కాక్రోచ్ పార్టీ
కాలుకాస్త దువ్వుతోంది
రాజీనామా చేయకుండ
అధికారం నవ్వుతోంది

పాలకులంటె ఉండాలి
ప్రజలకు జవాబుదారి
కుదరకుంటె పోరాటమే
లేదుకదా మరొకదారి

-పెనుగొండ బసవేశ్వర్..

# అర్చకుల సంక్షేమమే లక్ష్యం



కొడిమ్యాల, ( జన సైన్యం న్యూస్) కొడిమ్యాల, మల్యాల మండలాల ధూపదీప నైవేద్య అర్చకుల సమావేశం సోమవారం కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జగిత్యాల జిల్లా ధూపదీప నైవేద్య అధ్యక్షుడు నాగరాజు మహేంద్రాచారి,కొడిమ్యాల-మల్యాల మండలాల అధ్యక్షుడు నాగరాజు రమేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా అర్చకుల వివాహాలు, ఉపనయనాలకు ఆర్థిక సహాయం, అర్చకుల మరణానంతరం గ్రాట్యుటీ చెల్లింపు, గుర్తింపు కార్డుల జారీ, అర్చకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు.అనంతరం రెండు మండలాల అర్చకులు కలిసి జిల్లా అధ్యక్షుడు నాగరాజు మహేంద్రాచారిని శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కొడిమ్యాల, మల్యాల మండలాల ధూపదీప నైవేద్య అర్చకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వృద్ధులను వేధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు



జనసైన్యం సిటి

ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ వ్యతిరేక చైతన్య దినోత్సవం (జూన్ 15) సందర్భంగా కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వెలిచాల గ్రామ శివారులోని స్పందన వృద్ధుల ఆశ్రమంలో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివకుమార్ అనుమతితో, కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె. రాణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, పెరుక రంగయ్య, ప్యానెల్ అడ్వకేట్ లు బాశెట్టి సమతా రాణి, నిషాసింగ్ లు మాట్లాడుతూ సమాజంలో వృద్ధులపై జరుగుతున్న మానసిక, శారీరక వేధింపులను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవడం పిల్లల కనీస బాధ్యత అని పేర్కొన్నారు. వృద్ధుల రక్షణ కోసం అమల్లో ఉన్న 'తల్లిదండ్రులు మరియు వృద్ధుల పోషణ--సంక్షేమ చట్టం, 2007' గురించి వివరించారు. పిల్లలు లేదా వారసులు వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే ఆర్డీఓ ట్రిబ్యునల్ ద్వారా సులభంగా భరణం పొందే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ఆస్తులను వారసుల పేరున రాసిచ్చిన అనంతరం వారు మోసపూరితంగా వ్యవహరిస్తే, ఆయా రిజిస్ట్రేషన్లను రద్దు చేయించుకునే హక్కు కూడా వృద్ధులకు చట్టం కల్పించిందని స్పష్టం చేశారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా వృద్ధులకు అందుతున్న ఉచిత న్యాయ సేవల గురించి అవగాహన కల్పించారు. ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులకు కోర్టుల ద్వారా ఉచిత న్యాయవాది సేవలు అందిస్తామని తెలిపారు. కుటుంబ సమస్యలు, ఆస్తి వివాదాలు వంటి అంశాలను లీగల్ ఎయిడ్ కౌన్సెలింగ్, లోక్ అదాలత్‌ల ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా సామరస్యపూర్వకంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. వృద్ధులు ఎలాంటి ఇబ్బందులు, వేధింపులు ఎదుర్కొన్నా అధైర్యపడకుండా జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయాన్ని నేరుగా లేదా ఉచిత హెల్ప్‌లైన్ 15100 ద్వారా సంప్రదించి న్యాయ సహాయం పొందాలని సూచించారు. అనంతరం ఆశ్రమంలోని వయోవృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు మంచికట్ల శ్రీనివాస్, పారాలీగల్ వాలంటీర్లు శామీమ్, సుజాత, రవీందర్, ఆశ్రమ వృద్ధులు పాల్గొన్నారు.

# అచీవర్స్ పాఠశాలలో కోలాహలంగా పునః ప్రారంభ కార్యక్రమం

స్థానిక కోఠి రాంపూర్ లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో వేసవి సెలవుల అనంతరం ఈరోజు పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా స్వాగత కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. పల్లవి మరియు డైరెక్టర్ వెంకటేశ్వర్లు సంయుక్తంగా జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారు .విద్యార్థిని విద్యార్థులు తమ నృత్యాలు,పాటలు మరియు ఉపన్యాసాలతో అలరించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత సంవత్సరం యొక్క విజయాలను తెలియజేసి , ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు . అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో తమ లక్ష్యాలను చేరుకోగలరని వివరించారు . ఆ తర్వాత ఉపాధ్యాయ బృందము యొక్క పరిచయ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఉపాధ్యాయుల ఇష్టా గోష్టిలో ఉపాధ్యాయ బృందము తమ జ్ఞాపకాలను నెమరు వేసుకొని వచ్చే విద్యా సంవత్సరంలో ఇంకా సమిష్టి కృషితో పనిచేయాలని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సి.హెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి.హెచ్. పల్లవి ,పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు మరియు అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.










# విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన ఉపాధ్యాయులు




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలములోనీ రేపాక గ్రామ ఓజూష్ట్రం పాఠశాల లో ఈ రోజు ప్రధానోపాధ్యాయురాలు రేవతి గారి ఆధ్వర్యంలో ఈరోజు పాఠశాలలు పున ప్రారంభం తో పాటు మొదటి రోజు తరగతులు ప్రారంభం కావాలని ఉద్దేశంతో ఈరోజు రేపాక గ్రామ ఓజూష్ట్రం పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది..ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వీర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఈ రోజు రేపాక లో చదువుకున్న ఇద్దరు విద్యార్థులు మంచిగ చదివి బాసర ఐఐఐటీ లో చదువుకోవడం జరుగుతుంది కాబట్టి రేపాక గ్రామ మరియు పరిసర గ్రామాల ప్రజలు తల్లి దండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం మంచి ఆలోచన చేసి మన రేపాక ఓజూష్ట్రం పాఠశాల లో చదివివ్వాలని వారికి మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మంచి విద్యా బోధన చేయడం జరుగుతుంది కాబట్టి ఇట్టి సౌకర్యాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు...ప్రధానోపాధ్యాయురాలు రేవతి... వీరారెడ్డి...మల్లికార్జున్..రామేశ్వర రెడ్డి.. అబ్రార్ హైమద్. మల్లయ్య.. మాధవి.. సుజాత..రాధ రాణి..తో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..